# అవమానకర దుస్థితిలో విండీస్ క్రికెట్ జట్టు..!

1975లో ప్రారంభమైన వన్ డే క్రికెట్ (ఓడిఐ) వరల్డ్ కప్ 48-ఏళ్ల క్రికెట్ చరిత్రలో తొలి సారి "వెస్ట్ ఇండీస్ (విండీస్ లేదా కరేబియన్)" జట్టు లేకుండా "ఓడిఐ వరల్డ్ కప్ టోర్నమెంట్" జరుగనుందనే చేదు నిజం క్రికెట్ వీరాభిమానులకు మింగుడు పడడం లేదు. ఇటీవల ఓడిఐ వరల్డ్ కప్ అర్హతకు నిర్వహించిన సూపర్ సిక్స్ మ్యాచ్‌లో స్కాట్‌లాండ్ జట్టు చేతులో 7 వికెట్ల తేడాతో విండీస్ ఓడిపోవడం అభిమానులను నివ్వెరపరిచింది. స్కాట్‌లాండ్ జట్టు ఆటగాళ్లు మెరుగైన ఆటను ప్రదర్శించడం, విండీస్ జట్టు 43.5 ఓవర్లలో 181 పరుగులు మాత్రమే చేయగలగడం విస్మయాన్ని కలిగించగా, స్కాట్‌లాండ్ జట్టు 43.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయం స్వంతం చేసుకోవడమే కాకుండా వెస్ట్ ఇండీస్ జట్టును ప్రపంచ కప్‌కు దూరం చేయడం ఆశ్చర్యంగా తోస్తున్నది. 05 అక్టోబర్ 2023న ప్రారంభం కానున్న వరల్డ్ కప్‌లో విండీస్ జట్టు అర్హతను సాధించకపోవడం, గత ఘన చరిత్ర కలిగిన జట్టు అత్యంత దయనీయ స్థితిలో వెనుదిరగడం విచారకరం. 1975, 1979లలో జరిగిన తొలి రెండు వరల్డ్ కప్ పోటీల్లో విండీస్ జట్టు ఘన విజయం సాధించి కప్ అందుకోవడం చూసాం. 1983లో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్‌లో "కపిల్ డెవిల్స్" ఇండియా చేతిలో ఓడిపోవడం మొదలు వారి ఆత్మవిశ్వాసం క్రమంగా సన్నగిల్లుతూ పోవడం మనకు తెలుసు. అర్హత పోటీలు మరో రెండు ఉన్నప్పటికీ విండీస్ జట్టు వరల్డ్ కప్ పోటీలకు దూరం కావలసిన దుస్థితి రావడం సోచనీయం.

గత వైభవ గురుతులు:

1983 ప్రపంచ కప్ పోటీలో ఇండియా చేతిలో ఓటమి చవిచూసిన విండీస్ జట్టు తిరిగి పూర్వపు వైభవాన్ని ప్రదర్శించలేకపోవడం చూస్తున్నాం. 2012, 2016ల్లో జరిగిన టీ20 ప్రపంచ కప్‌లను గెలవడంతో పాటు 2004 చాంపియన్స్ ట్రోఫీ స్వంతం చేసుకున్న విండీస్, టెస్ట్ క్రికెట్‌లో కూడా అద్భు బౌలింగ్, బ్యాటింగ్ విన్యాసాలను ప్రపంచ క్రీడాభిమానులు ఇంకా మరిచి పోలేదు. 2019 ఓడిఐ వరల్డ్ కప్‌లో కూడా క్వాలిఫైయర్ మ్యాచ్‌లో ఆడిన విండీస్ అర్హతను సాధించడం జరిగింది. ఒకనాడు ఫాస్ట్ బౌలింగ్‌కు, బ్యాటింగ్ మెరుపులకు చిరునామాగా నిలిచిన విండీస్ జట్టు ఇతర దేశ జట్ల ఆటగాళ్లకు చుక్కలు చూపించేవి. 1970-80 దశకాల్లో అత్యున్నత ఆటతీరును రుచి చూపిన విండీస్ జట్టు నేడు దయనీయ స్థితిలో ప్రపంచ కప్ మైదానాలకు అర్హత సాధించకపోవడం నమ్మలేకుండా ఉంది. వివియన్ రిచర్డ్స్, క్లీవ్ లాయిడ్స్, హోల్డింగ్, రాబర్ట్, సోబర్స్, గిబ్స్, మార్షల్, గ్రిఫిత్, దూజాన్, ముర్రే, గార్నర్ లాంటి పేర్లు క్రికెట్ చరిత్ర పుటల్లో మరిచిపోలేని గురుతులుగానే మిగిలి పోయాయి. నేడు వెంటిలేటర్‌పై ఉన్న విండీస్ జట్టును స్కాట్‌లాండ్ జట్టు వెంటిలేటర్ నుంచి తొలగించి తుది శ్వాసకు వదిలేయడం అత్యంత విచారకరమని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీర్ఘాయుష్షు ఉండాల్సిన విండీస్ జట్టు ఇంత పేలవమైన స్థితికి చేరడం నమ్మలేని నిజంగా తోస్తున్నది. 2022 నవంబర్‌లో టెస్ట్ క్రికెట్‌లో 8వ స్థానం, ఓడిఐల్లో 10వ ర్యాంకు, టీ20ల్లో 7వ ర్యాంకులను పొందిన విండీస్ నేడు వరల్డ్ కప్‌కు అర్హత సాధించకపోవడం సోచనీయం.

విండీస్ జట్టుకు పట్టిన చీడపీడలు:

విండీస్ క్రికెటర్లు టీ20 లీగ్ పోటీల్లో పాల్గొనేందుకు అత్యుత్సాహం చూపడంతో దేశ జట్టు బలహీన పడిందని, నేడు తిరిగి పూర్వపు స్థితికి చేరడానికి మరింత సమయం పడుతుందని అర్థం అవుతున్నది. తదనంతర తరాల్లో బ్రియాన్ లారా, హూపర్, చంద్రపాల్, క్రిస్ గేల్, శరవన్, సామ్యుయేల్ లాంటి క్రికెట్ దిగ్గజాలు వివిధ ఫార్మెట్లలో కొంత మేరకు మెరుపులు ప్రదర్శించినప్పటికీ పూర్వపు వెలుగులు చూపించలేకపోవడం అభిమానులను నిరాశ పరుస్తున్నది. తొలి రెండు వరల్డ్ కప్‌లో గెలిచిన విండీస్ 1983 తరువాత సెమీఫైనల్‌కు (1996 మినహా) కూడా చేరకపోవడం కొంత విస్మయాన్ని కలిగిస్తున్నది. విండీస్ జట్టు ఎంపికలో అవకతవకలు, ఆటగాళ్ల పారితోషకాల్లో అసంతృప్తులు, నైపుణ్యం కలిగిన ఆటగాళ్లు అధిక పారితోషికాల కోసం టీ20 లీగ్ పోటీలను ఎంచుకోవడం, ఆటగాళ్లు పారితోషికాలకు నిరసనగా జట్టుకు దూరం కావడం లాంటి పలు కారణాలు విండీస్ జట్టుకు పట్టిన చెదలుగా నమ్మాల్సి వస్తున్నది. నేటి విండీస్ జట్టు జింబాబ్వే, నెదర్‌లాండ్, స్కాట్‌లాండ్ జట్ల చేతిలో అపజయ పరాభవాలను ఎదుర్కోవడంతో జట్టు ఆత్మవిశ్వాసం పూర్తిగా సడలినట్లు అయ్యిందని విశ్లేషిస్తున్నారు.

గత విజయ వైఫల్యాలను మరిచి కరేబియన్ జట్టు తిరిగి ఆత్మవిశ్వాసాన్ని పొంది, క్రికెట్ మైదానంతో నల్లటి కండల నైపుణ్యాలను ప్రదర్శించి, జట్టు ఎంపికలో అశ్రితపక్షపాతాలకు మంగళం పాడి, దేశం కోసం టీ20 లీగ్‌ల్లో ప్రాధాన్యాన్ని తగ్గించి, ఆకర్షణీయ పారితోషికాలను అందిస్తూ ప్రపంచ క్రికెట్‌లో తమదైన స్థానాన్ని పదిలపరుచుకోవాలని ఆశిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి



హన్మకొండ, జులై 7: (నేటినిజం ప్రతినిధి): భారత ప్రధాని నరేంద్ర మోడీ వరంగల్ పర్యటన సందర్భంగా శుక్రవారం వరంగల్ భద్రకాళి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఓరుగల్లు నగరం దేశంలోనే సాంస్కృతిక వైభవానికి ముడిపడినటువంటి నగరం అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది అన్నారు. వరంగల్ నగరానికి భారత ప్రధాని నరేంద్ర మోడీ విచ్చేయడం చాలా ప్రాధాన్యం వరంగల్ ప్రజల యొక్క ఆశీస్సుల కోసం నరేంద్ర మోడీ నగరానికి రానున్నారు. శనివారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని మిగతా కార్యక్రమాలు ప్రారంభించనున్న ప్రధాని మోడీ. 30 సంవత్సరాలుగా ప్రధానిగా వరంగల్ నగరానికి ఎవరు రాలేదు. ప్రధాని పర్యటన నగరానికి కొత్త తేజస్సును నగరానికి తీసుకురనుంది ఎంతో చరిత్ర కలిగిన కాకతీయుల నగరం మరింత అభివృద్ధి బాటలో తీసుకువెళ్లేందుకు కృషిచేయనున్నారు అని తెలిపారు.

# ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీతో సమావేశమైన ఫ్రాన్స్ అధ్యక్షుని దౌత్యసంబంధి సలహాదారు

న్యూఢిల్లీ, జులై 7:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తో ఫ్రాన్స్ అధ్యక్షుని దౌత్యసంబంధి సలహాదారు శ్రీ ఇమేన్యుయల్ బోనే ఈ రోజు న సమావేశమయ్యారు.

ప్రధాన మంత్రి త్వరలో ఫ్రాన్స్ ను సందర్శించనుండగా ద్వైపాక్షిక సహకారం పరం గా వివిధ రంగాల లో చోటు చేసుకొంటున్న పురోగతి ని శ్రీ బోనే ప్రధాన మంత్రి దృష్టి కి తీసుకు వచ్చారు.

జులై 14 వ తేదీ నాడు జరుగనున్న బేస్టిల్ డే వేడుకల లో గౌరవ అతిథి గా పాలుపంచుకోవాలంటూ అధ్యక్షుడు శ్రీ మేక్రోన్ ఆహ్వానించినందుకు ప్రధాన మంత్రి కృతజ్ఞత ను వ్యక్తం చేశారు.

అధ్యక్షుడు శ్రీ మేక్రోన్ తో హిరోశిమా లో ఇటీవల తాను జరిపిన సమావేశాన్ని ప్రధాన మంత్రి గుర్తు కు తెచ్చుకొంటూ, తమ ఇద్దరి సంభాషణ ను పేరిస్ లోనూ కొనసాగించాలని ఉత్సుకత తో ఉన్నానన్నారు. ఆ సంభాషణ భారతదేశం-ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత గా బలోపేతం చేయగలదన్న అంచనా ఉంది.

# అతి తక్కువ వ్యవధిలో 140 అంతరిక్ష అంకుర సంస్థలు పనిచేయడం ప్రారంభించడంతో అంతరిక్ష రంగంలో భారతదేశం తన స్థానం సుస్థిరం

న్యూఢిల్లీ, జులై 7:అతి తక్కువ వ్యవధిలో 140 అంతరిక్ష అంకుర సంస్థలు పనిచేయడం ప్రారంభించడంతో అంతరిక్ష రంగంలో భారతదేశం తన స్థానాన్ని సుస్థిరం చేసుకుని అంతర్జాతీయ గుర్తింపు పొందింది అని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ (స్వతంత్ర బాధ్యత) , పీఎంఓ లో సహాయ మంత్రి, అణుశక్తి, అంతరిక్షం, సిబ్బంది ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ప్రపంచం మొత్తం భారతదేశం సామర్థ్యాలు, అంతరిక్ష సాంకేతికతలో ఆమె సామర్థ్యాన్ని గుర్తించడం ప్రారంభించిందన్నారు. ఈ రోజు బెంగళూరులో జరిగిన జీ- 20 4వ స్పేస్ ఎకానమీ లీడర్స్ మీటింగ్ ప్రారంభ కార్యక్రమంలో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాలతో అంతరిక్ష రంగంలో భారతదేశం అభివృద్ధి సాధించిందని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలోకి ప్రైవేటు రంగాన్ని అనుమతించడంతో అంతరిక్ష రంగం గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధి పథంలో దూసుకు పోతున్నదని మంత్రి అన్నారు. దేశాలతో పోల్చి చూస్తే భారతదేశంలో తన అంతరిక్ష ప్రయాణాన్ని ప్రారంభించిందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. అయితే, ఆలస్యంగా అంతరిక్ష రంగంలోకి ప్రవేశించిన భారతదేశం ప్రపంచ స్థాయి అంతరిక్ష సంస్థలకు సలహాలు, సూచనలు, సమాచారం అందించే స్థాయికి ఎదిగిందన్నారు.

అంతరిక్ష సాంకేతికతలో అగ్రగామిగా చెప్పుకుంటున్న దేశాలు ప్రస్తుతం భారతదేశం మార్గదర్శకత్వం కోసం ఎదురు చూస్తున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల అమెరికా పర్యటన సందర్భంగా అంతరిక్ష సంబంధిత ఒప్పందాలు ఎక్కువగా కుదరడం భారతదేశ సామర్థ్యానికి గుర్తింపు అని మంత్రి వ్యాఖ్యానించారు.

అంతరిక్ష రంగం అభివృద్ధిలో ప్రైవేటు రంగం పోషిస్తున్న పాత్రను డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసించారు. అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటు రంగం పాత్ర "కీలకమైనది" అని పేర్కొన్నారు.

అంతరిక్ష పరిశోధన కోసం ప్రపంచ దేశాల మధ్య సహకారం, సమన్వయము ముఖ్యమని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. అంతరిక్షాన్ని అన్వేషించడానికి అన్ని దేశాలు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో దేశాల మధ్య సహకారం అవసరమన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో స్పేస్ ఎకానమీ భాగం పెరగాలన్నారు. దీనికోసం అంతరిక్ష వ్యవహారాలకు ప్రాధాన్యత ఇస్తున్న దేశాలు కలిసి ఒక కూటమిగా పనిచేయాల్సి ఉంటుందన్నారు.

మానవాళి భవిష్యత్తు, సుస్థిర ఆర్థిక అభివృద్ధి సాధించడానికి, సామాన్య ప్రజల జీవితాలను మెరుగు పరచడానికి అంతరిక్ష సాంకేతికతను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలి." అని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ భాగాన్ని పెంపొందించడానికి చర్యలు అమలు కావాల్సి ఉంటుంది. ఇది ప్రస్తుత అవసరం. దీనికోసం అంతరిక్ష వ్యవహారాలకు ప్రాధాన్యత ఇస్తున్న దేశాలు కలిసి ఒక కూటమిగా పనిచేయాల్సి ఉంటుంది. కూటమి ఏర్పాటులో భాగంగా జరుగుతున్న చర్యల్లో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు అయ్యింది. 'వసుధైవ కుటుంబం' సాధన కోసం "ఒకే భూమి, ఒకే అంతరిక్షం, ఒక భవిష్యత్తు" అనే భారతదేశపు జీ-20 స్ఫూర్తికి అనుగుణంగా సదస్సు ఏర్పాటు అయ్యింది" అని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

అంతరిక్ష సాంకేతికత ఆర్థిక వ్యవస్థ లోని వివిధ మూలస్తంభాలను ఒకే గొడుగు కిందకి తీసుకు వస్తుంది. దీంతో అంతరిక్ష రంగంలో చేసే పెట్టుబడులు దేశాలు, ఆర్థిక వ్యవస్థల మొత్తం అభివృద్ధిపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ తదుపరి ట్రిలియన్ డాలర్ల రంగంగా ఉంటుందని అధ్యయనాలు అంచనా వేస్తున్నాయి. రాబోయే దశాబ్దాలలో ఆర్థిక వ్యవస్థలో అంతరిక్ష ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను ప్రైవేటు రంగానికి అందుబాటులోకి తీసుకురావాలని భారతదేశం నిర్ణయించింది. సమగ్ర అభివృద్ధి సాధించడానికి ఇతర దేశాలతో కలిసి పనిచేయడానికి భారతదేశం వివిధ చర్యలు ప్రారంభించింది, "అని ఆయన అన్నారు.

సమావేశంలో పాల్గొంటున్న ప్రైవేటు సంస్థలు, వివిధ దేశాలకు చెందిన నిపుణులు అందించే సలహాలు, సూచనలు భూగోళంపై సానుకూల ప్రభావాన్ని చూపించే నిర్ణయాలు తీసుకోవడానికి ఉపకరిస్తాయన్న ఆశాభావాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ వ్యక్తం చేశారు.

"జీ-20 దేశాలు, సభ్య దేశాలు ప్రపంచ జీడీపీ లో 75 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఈ దేశాలలో ప్రపంచ జనాభాలో 20% మంది నివసిస్తున్నారు. ప్రపంచ వాణిజ్యంలో 75% వాటా జీ-20 దేశాలు, సభ్య దేశాలు కలిగి ఉన్నాయి. ఇక్కడ తీసుకునే నిర్ణయాలు అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తుపై ఎక్కువ ప్రభావం చూపుతాయి, "అని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. 6 దశాబ్దాల చరిత్ర కలిగిన అంతరిక్ష కార్యక్రమంలో భారతదేశం అంతరిక్ష సాంకేతిక సామర్థ్యాన్ని ప్రదర్శించిందని మంత్రి అన్నారు.

ప్రస్తుతం అన్ని రంగాలపై అంతరిక్ష రంగం ప్రభావం చూపుతోంది. శాస్త్ర సాంకేతిక రంగం, టెలికమ్యూనికేషన్, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, విపత్తు హెచ్చరిక ఉపశమనాలు, వాతావరణ మార్పు, నావిగేషన్, రక్షణ, పరిపాలన వంటి వాటితో సహా మానవ జీవితంలో అన్ని రంగాలను అంతరిక్ష రంగం ప్రభావితం చేస్తోంది తాకింది" అని ఆయన వివరించారు.

జాతీయ అంతరిక్ష సంస్థల అధిపతులు, జీ-20 దేశాలకు చెందిన ప్రముఖ అంతరిక్ష పరిశ్రమల ప్రతినిధులు , జీ-20 దేశాల సీనియర్ దౌత్యవేత్తలు ,ఆహ్వానిత దేశాలతో పాటు ఇతర ప్రముఖులు రెండు రోజుల సమావేశానికి హాజరవుతున్నారు.

# జపాన్ మాజీ ప్రధాని/జపాన్-ఇండియా అసోసియేషన్ (జిఐఎ) చైర్మన్ మాననీయ యోషిడే సుగాతో ప్రధానమంత్రి సమావేశం

న్యూఢిల్లీ, జులై 7:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీతో ఇవాళ జపాన్ మాజీ ప్రధాని/జపాన్-ఇండియా అసోసియేషన్ (జిఐఎ) చైర్మన్ మాననీయ యోషిడా సుగా సమావేశమయ్యారు. 'గణేశ నో కై' పార్లమెంటేరియన్లతోపాటు 'కెడాన్‌రెన్' (జపాన్ వాణిజ్య సమాఖ్య) పారిశ్రామిక ప్రతినిధులు, ప్రభుత్వాధికారులతో కూడిన 100 మంది బృందంతో శ్రీ సుగా తొలిసారి భారత పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం భారత-జపాన్‌ల మధ్య ప్రత్యేక-వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యం విస్తరణపై వారిద్దరూ అభిప్రాయాలు వెల్లడించుకున్నారు. పెట్టుబడులు, ఆర్థిక సహకారం, రైల్వేలు, ప్రజల మధ్య స్నేహబంధాలు, నైపుణ్యాభివృద్ధి భాగస్వామ్యం తదితర అంశాలపైనా వారు చర్చించారు.

ఉభయ దేశాల మధ్య పార్లమెంటరీ సంబంధాల బలోపేతంపై ''గణేశ నో కై' పార్లమెంటరీ బృందంతోనూ ప్రధాని చర్చలు ఫలప్రదమయ్యాయి. జపాన్‌లో యోగాతోపాటు ఆయుర్వేదానికి ప్రజాదరణ పెరుగుతుండటంపై వారు హర్షం ప్రకటించారు. భారత్-జపాన్ల మధ్య సాంస్కృతిక సంబంధాలను మరింత పటిష్టం చేసే మార్గాలపైనా వారు సంభాషించారు.

'కెడాన్‌రెన్' (జపాన్ వాణిజ్య సమాఖ్య) బృందానికీ ప్రధాని సాదర స్వాగతం పలికారు. దేశంలో వాణిజ్య పర్యావరణం మెరుగుకు ప్రభుత్వం చేపట్టిన విస్తృత సంస్కరణల గురించి ఆయన వారికి వివరించారు. భారత్‌లో జపాన్ ప్రస్తుత పెట్టుబడులను మరింత పెంచాలని, పరస్పర సహకారం దిశగా కొత్త రంగాలను అన్వేషించాలని పిలుపునిచ్చారు.

# కొత్త టెక్నాలజీ బోట్లతో మత్స్యకారులకు ఎంతో ఉపయోగం- కిరణ్ రిజిజు



అమరావతి, జులై 7:కొత్త టెక్నాలజీతో బోట్లను తీసుకురావడం వలన మత్స్యకారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ అండ్ భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్ శాఖల సమన్వయంతో మత్యకారులకి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, బందరు ఎంపీ బాలసౌరి, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మత్యకార సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ? మత్స్యకారులకు సముద్రంలో ఏ విధంగా చేపల వేట చేయాలి, సముద్రంలో ఏ ప్రదేశంలో ఎక్కువగా మత్యసంపద లభ్యమవుతున్నాయి, సముద్రంలో అలల ఉధృతి ఏ విధంగా ఉన్నది లాంటి విషయాలను ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునే విధంగా భారత ప్రభుత్వం ఆజాదిక అమృత్ మహోత్సవాల్లో భాగంగా యాప్ లు తయారుచేసి మత్స్యకారులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం నిర్వహించే నాలుగు వర్క్ షాపులలో మొదటి అవగాహన సదస్సు మచిలీపట్నంలో నిర్వహించినందుకు మచిలీపట్నం ప్రజల తరపున బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. మత్స్యకారుల సంక్షేమానికి అవసరమైన సమాచార వ్యవస్థను ఒక యాప్ ద్వారా ఎప్పటికప్పుడు అందించడం కోసం స్వామినాథన్ ఫౌండేషన్ తరపున శాస్త్రవేత్తలు ప్రకృతి విపత్తుల గురించి సముద్ర స్థితిగతుల గురించి సమాచారం అందించే తీరు ప్రశంసనీయమని ఎంపీ తెలిపారు.

# వేరుశనగ రైతులకు పరిహారం చెల్లించాలి.. కలెక్టరేట్ వద్ద టీడీపీ ధర్నా




అమరావతి, జులై 7: శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వేరుశనగ పంట సాగుచేసి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించలేదని తెలుగుదేశం పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. శుక్రవారం నాయకులు స్థానిక గణేష్ సర్కిల్లో వారు మాట్లాడుతూ.. జిల్లాలో 10లక్షల రైతు కుటుంబాలు ఉంటే నామమాత్రంగా ఇన్సూరెన్స్ లు చెల్లించి రైతులను నట్టేట ముంచారన్నారు. ఒకసారి అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ రైతుల పక్షపాతి అని చెప్పుకుంటున్నారు కానీ చేసింది శూన్యమన్నారు.

అనంతరం నన్నే సర్కిల్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు పార్థసారథి, మాజీ మంత్రులు పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల సునీత, మాజీ ఎంపీ నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, నాయకులు అంబికా లక్ష్మీనారాయణలతో పాటు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# లాడ్జిలో ప్రేమజంట ఆత్మహత్య

అమరావతి, జులై 7:: యువతి ఉరివేసుకొని, యువకుడు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గత రాత్రి ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస భవన్ లాడ్జిలో రూమ్ నెంబర్ 309 లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలానికి చెందిన మానసతో ఎమ్మిగనూరు మండలం దైవందిన్నే గ్రామానికి చెందిన రాముడుకు పరిచయం ఏర్పడింది. తిరుపతిలో కోచింగ్ కి వెళ్ళిన రాముడుతో మానసకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది.

అయితే ఏం జరిగిందో ఏమో మానసను ఆదోనికి పిలిపించుకొని లాడ్జిలో ఉంటూ.. వారిద్దరిలో మానస ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా.. రాముడు బిర్యానిలో పురుగుల మందు కలుపుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఈరోజు ఉదయం తలుపు తెరవకపోవడంతో లాడ్జ్ నిర్వాహకులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో రెండవ పట్టణ సీఐ శ్రీనివాస నాయక్ సంఘటన స్థలానికి వెళ్లి ఆరా తీసి, మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మరిన్ని వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతుడు రాముడుకు గత నెల క్రితం సంఘాల గ్రామానికి చెందిన రమాదేవి అనే యువతీతో వివాహమైనట్లు తెలిసింది. మరిన్ని వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

# శ్రీ దలై లామాకు ఆయన 88 వ జన్మదినం నాడు శుభాకాంక్షలను తెలియజేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 7:పరమ పూజ్యులు శ్రీ దలై లామా కు ఆయన 88 వ పుట్టినరోజు సందర్భం లో ఈ రోజున ఉదయం పూట ఫోన్ ద్వారా శుభాకాంక్షల ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తెలియ జేశారు."పరమ పూజ్యులు శ్రీ ఏఆజీశ్రీజీతిఒజీఏజీ గారితో మాట్లాడి, ఆయన యొక్క 88వ జన్మదినం సందర్భం లో నా హృదయ పూర్వక శుభాకాంక్షల ను అందజేశాను. ఆయన కు దీర్ఘాయుష్షు కలగాలని, మరి ఆయన ఆరోగ్యప్రద మైనటువంటి జీవనాన్ని గడపాలని నే ను అభిలషిస్తున్నాను." అని పేర్కొన్నారు.

# తెలంగాణలో అధికారంలోకి వస్తే నీతివంతమైన పాలన అందిస్తాం..

వరంగల్, జులై 7:హన్మకొండ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బొమ్మ, బొరుసు లాంటివని.. ఆ రెండు పార్టీల డీఎన్ఏ ఒకటేనని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ ఏనాడూ కాంగ్రెస్‌తో గానీ, బీఆర్ఎస్‌తో గానీ కలిసిన దాఖలాలు లేవన్నారు. కానీ . గతంలో ఆ రెండు పార్టీలు కలిసి పని చేశాయని, ప్రభుత్వాన్ని పంచుకున్నాయని అన్నారు. వరంగల్ జిల్లాలోని హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానాన్ని సందర్శించిన కిషన్ రెడ్డి అక్కడ ప్రధాని నరేంద్ర మోడీ సభా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సభా ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ.. సోషల్ మీడియా ద్వారా బీజేపీపై అబద్ధాలు కుట్రపూరితంగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ఏ విధంగా పోరాడుతున్నామో మోడీ వివరిస్తారని వెల్లడించారు. కల్వకుంట్ల కుటుంబ పాలనకు చరమగీతం పాడేలా బీజేపీ కృషి చేస్తోందన్నారు.

కల్వకుంట సర్కార్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, వచ్చే ఎన్నికలలో ఆ కుటుంబ ప్రభుత్వాన్ని ఫామ్ హౌస్‌కు పరిమితం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కేసిఆర్ ప్రభుత్వం కమిషన్‌ల, వాటాల ప్రభుత్వంగా మారిందని వ్యాఖ్యానించారు. పెట్టుబడుల ప్రభుత్వంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉందని బహుళజాతి కంపెనీలకు భారత్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని అన్నారు. అతిపెద్ద ఆర్థికాభివృద్ధి దేశంగా ఐదోస్థానంలో మనం ఉన్నామన్నారు. తాము తెలంగాణలో అధికారంలోకి వస్తే నిజమైన, నీతివంతమైన పాలనను తీసుకువస్తామని హామీ ఇచ్చారు. దేశంలో నీతివంతమైన పాలన మోడీ నేతృత్వంలో కొనసాగుతోందన్నారు. మోడీ స్ఫూర్తితో తెలంగాణలో కుటుంబరహిత నీతివంతమైన పాలనను తీసుకొస్తామన్నారు.

ఇక చారిత్రాత్మకమైన వరంగల్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొలిసారి వస్తున్నారన్నారు. రూ.6,109 కోట్లు జాతీయ రహదారులకు, రూ.521 కోట్లతో కాజీపేటలో రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు మోడీ శంకుస్థాపన చేస్తారని కిషన్ రెడ్డి తెలిపారు. తొలి దశలో రూ.521 కోట్లతో రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ని ఏర్పాటు చేస్తున్నామని.. దీని వల్ల 3వేల మందికి ఉద్యోగా అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇందుకు తాను ప్రధాని మోడీకి తెలంగాణ రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, అధికారిక కార్యక్రమాల అనంతరం మోడీ విజయ సంకల్ప సభలో ప్రసంగిస్తారని వెల్లడించారు..

# జిల్లాలో భూ క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి

మెదక్, జులై 7:(నేటినిజం ప్రతినిధి):జిల్లాలో భూ క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్ లు, రెవెన్యూ అధికారులు, తహసిల్దార్ లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జీఓ 58, 59, 76, 118 క్రింద భూ క్రమబద్ధీకరణ, ధరణి పెండింగ్ దరఖాస్తులు, ధరణి లో నూతన ఆప్షన్ పై సమీక్షించారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, జీఓ 59 క్రింద గతంలో వచ్చిన దరఖాస్తులలో 10 లక్షల కంటే అధికంగా చెల్లించాల్సిన 1458 దరఖాస్తుదారులు ఇప్పటి వరకు చెల్లింపులు ప్రారంభించలేదని, వెంటనే వారికి నోటీసులు జారీ చేసి చెల్లింపు చేయని పక్షంలో భవన నిర్మాణాల కూల్చివేతలు ప్రారంభించాలని సూచించారు. జీఓ 59 క్రింద లక్ష లోపు చెల్లించాల్సిన 3689 దరఖాస్తుదారులకు సైతం నోటీసు అందించి త్వరితగతిన చెల్లింపు చేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వం చాలా తక్కువ ధరకు భూ క్రమబద్ధీకరణ చేస్తున్నప్పటికీ అలసత్వం వహించడం సరికాదని, లబ్ధిదారులు ముందుకు వచ్చి చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూముల క్రమబద్ధీకరణ కటాఫ్ తేదీని 2 జూన్ 2020 కు పొడిగిస్తూ జీఓ 58, 59 ,76 కింద ప్రభుత్వం మరో మారు దరఖాస్తులను స్వీకరించిందని, అట్టి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టేందుకు బృందాలను ఏర్పాటు చేసి నెలరోజుల వ్యవధిలో క్షేత్రస్థాయి విచారణ ద్వారా అర్హులను ఎంపిక చేయాలని ఆయన సూచించారు. ధరణి కింద పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ లకు సూచించారు. భూ సమస్యల పరిష్కారం కోసం దరణిలో కొత్తగా ఐదు మాడ్యూల్స్ అందుబాటులోకి తెచ్చామని, ధరణి సేవలను విస్తృతం చేయడంతో పాటు చిన్న, చిన్న లోపాలను సవరించడం జరుగుతుందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ధరణి ఆపరేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ జి.ఓ. 59 క్రింద ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణకు లక్ష లోపు, 10 లక్షల పై రుసుము కట్టవలసి ఉన్న వారికి నోటీసులు ఇచ్చి తక్షణవే వసూలు చేయవలసినదిగా సూచించారు. పొడగింపు తరువాత నూతనంగా జి.ఓ. 58 క్రింద వచ్చిన 1230 దరఖాస్తులు, జి.ఓ. 59 క్రింద వచ్చిన 897 దరఖాస్తులను జిల్లా అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో ఏర్పాటు చేసిన 21 సర్వే బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటించి సరైన వివరాలను సంబంధిత యాప్ లో నమోదు చేయవలసినదిగా సూచించారు. అదేవిధంగా సర్వే బృందాలు గ్రామాలలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు, అటవీ భూములున్నాయో మ్యాపింగ్ చేసుకుని సరిహద్దులు ఏర్పాటు చేయాలన్నారు. ధరణి క్రింద పెండింగులో ఉన్న 4,271 దరఖాస్తులను పరిష్కరించవలసినదిగా సూచించారు. మండలాలలో అర్హులైన లబ్దిదారులకు ఇండ్ల స్థలాల పంపిణీకి స్థలాలను గుర్తించి లే అవుట్ సిద్ధం చేయాలని, గ్రామ పంచాయతీ తీర్మానాలకు ప్రాముఖ్యత నివాలని తహసీల్దార్లకు సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల భర్తీకి చర్యలు తీసుకోవడంతో పాటు నూతనంగా ఏర్పాటు చేయవలసిన చౌక ధరల దుకాణాలపై నివేదిక అందజేయవలసినదిగా సూచించారు. శనివారం నర్సాపూర్ లో రాష్ట్ర ఆర్థిక,వైద్య ఆరోగ్య శాఖామాత్యులు చేతుల మీదుగా పోడు పట్టాలు ఇచ్చుటకు మండల వారీగా పోడు పట్టాలు సిద్ధం చేసుకొని తీసుకురావలసినదిగా కలెక్టర్ ఆదేశించారు. మండలాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాలకు వెంటనే స్థలాలు గుర్తించి అప్పగించవలసినదిగా ఆదేశించారు. హరిత హారం కార్యక్రమంలో భాగంగా సంపద వనాల క్రింద 24 బ్లాకులను గుర్తించామన్నారు. గృహలక్ష్మి క్రింద జనధన్ ఖాతా కాకుండా కొత్తగా మహిళ లబ్ధిదారుల పేర ఖాతాలు తెరిపించాలన్నారు. రెండు పడకల గదుల ఇళ్లకు సంబంధించి పెండింగ్ లబ్ధిదారుల వివరాలు అదజేయవలసినదిగా కలెక్టర్ తహసీల్దార్లకు సూచించారు. అదేవిధంగా నూతన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులపై ప్రత్యేక శ్రద్ధ వహించవలసినదిగా తహసీల్దార్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, నర్సాపూర్, తూప్రాన్ ఆర్ డి ఓ లు శ్రీనివాసులు, జయచంద్ర రెడ్డి, డి.ఎఫ్.ఓ. రవి ప్రసాద్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# షెడ్యూల్ ప్రకారమే ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు

## - ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి

అమరావతి జులై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారంపై ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి స్పందించారు. షెడ్యూల్ ప్రకారమే ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని సజ్జల స్పష్టం చేశారు."ముందస్తు ఎన్నికలంటూ కొన్ని పార్టీలు, కొన్ని మీడియా సంస్థలు చేసే హడావిడి. మాకు సంబంధించిన వరకు ఐదేళ్లు ఆఖరి రోజు వరకు పూర్తిగా వినియోగించుకుంటాం. వైసీపీ కి పూర్తి సమయం అవసరం...ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయి. సీఎం జగన్ ఎప్పుడు ఢిల్లీ వెళ్లినా నిర్మాణాత్మకంగా వెళ్తున్నారు. సానుకూల ఫలితాలు వస్తున్నాయి. ముందస్తు ఎన్నికలంటే మా దగ్గర సమాచారం నుంచి వస్తుంది. పవన్‌ను ఒప్పించుకోవడానికా ముందస్తు ప్రచారం. జగన్ పాజిటివ్ ఓటును మాత్రమే నమ్ముకున్నారు. అమరావతి లో ఇళ్ల నిర్మాణం జరుగుతుంది. రాష్ట్ర వాటాతో పనులు జరుగుతాయి. ఇళ్ల స్థలాలు ఇచ్చింది.. ఆదుకోవడానికా.. రాజధాని ప్రాంతంలో ఇళ్ళు కట్టద్దు అని కోర్టు చెప్పలేదు." అని సజ్జల అన్నారు.వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిలపై సజ్జల స్పందిస్తూ.. ఒకసారి పార్టీ పెట్టాక ఆమె ఇష్టమని, ఆమె నిర్ణయం ఆమెది అని అన్నారు. ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో ఆమె ఇష్టమని సజ్జల స్పష్టంగా చెప్పారు.

# ప్రమాద రహిత సమాజం కోసం డ్రైవింగ్ లైసెన్సులు తప్పనిసరి.. మంత్రి పువ్వాడ



ఖమ్మం, జులై 7: (నేటినిజం ప్రతినిధి): సమాజంలో ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రమాద రహిత సమాజం నిర్మించాలంటే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఖమ్మం వి.డి.ఓ.స్ కాలనీ మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాను శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రారంభించారు. నేటి నుండి సెప్టెంబర్ 23వ తేదీ వరకు నిర్విరామంగా ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఖమ్మం నియోజకవర్గ ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి కోరారు. రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు సూచనలతో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ పంపిణీ ప్రక్రియను ప్రారంభించడం జరిగిందన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఈ అవకాశం కల్పించాలని పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాకు అయ్యే ఖర్చును పువ్వాడ ఫౌండేషన్ భరిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయటం చట్టరీత్యా నేరమని, అజాగ్రత్త వల్ల వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. సరైన అవగాహన లేకుండా వాహనాలు నడిపితే మనతో పాటు ఎదుట వారి ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేసిన వారం అవుతామన్నారు. నేటి యువతకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరిగా ఉండాల్సిన హక్కు అని, దాన్ని నిర్లక్ష్యం చేయొద్దని, మనం చేసే చిన్నపాటి తప్పిదం వల్ల ఎన్ని విలువైన ప్రాణాలు బలి అయిపోతాయాని వివరించారు. అందుకే యువతను దృష్టిలో పెట్టుకొని ఖమ్మం నియోజకవర్గంలో అందరికీ ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ అందజేస్తున్నామన్నారు. లైసెన్స్ పొందటానికి అవసరమైన ఫీజు తానే చెల్లిస్తానని, ఎవరూ ఒక్క రూపాయి చెల్లించాల్సిన పని లేదని, ఖమ్మం నియోజకవర్గంలో అందరికీ లైసెన్స్‌లు ఉచితంగా అందజేస్తామన్నరు. ముందు లెర్నింగ్ లైసెన్స్ ఆతరువాత పర్మినెంట్ లైసెన్స్ అందజేస్తారని, ఇక్కడ స్లాట్ బుక్ చేసుకున్న అనంతరం రవాణా శాఖ కార్యాలయంలో ఫోటో దిగి, సంతకం చేసి మళ్ళీ మన క్యాంపు కార్యాలయంలో ఆయా లెర్నింగ్ లైసెన్స్ (ఎల్.ఎల్.ఆర్) పత్రం పొందాలని మంత్రి కోరారు. దీంతో పాటు ఇక్కడే (ఎల్ఎల్ఆర్) పొందిన యువతకు ప్రత్యేక శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తామన్నారు.

డ్రైవింగ్ పై పూర్తి అవగాహనతో పాటు ట్రాఫిక్ సిగ్నల్స్ పై యువతకు అవగాహన కల్పిస్తామని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్, డ్రైవింగ్ రూల్స్ తెలుసుకోవాల్సిన బాధ్యత మనకు ఉందన్నారు. రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మంత్రికి మాత్రమే ఉండే అధికారంతో ఫాన్సీ నంబర్ లు కేటాయించే విధంగా ఉండేదని, కానీ ప్రభుత్వంకు వచ్చే ఆదాయంను దృష్టిలో ఉంచుకుని ఫాన్సీ నంబర్ ను బెడ్స్ ద్వారా నేరుగా ప్రజలకే అందిస్తున్నామని పేర్కొన్నారు. తద్వారా రవాణా శాఖకు గత ఏడాది కేవలం ఫ్యాన్సీ నంబర్ ద్వారా రవాణాశాఖ కు 74 కోట్ల ఆదాయం వచ్చిందని, అది ఈ ఏడాది వంద కోట్లు దాటుతుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. తాను రవాణాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత పారదర్శకంగా రవాణాశాఖలో పనులు జరుగుతున్నాయని, అన్ని సేవలు దాదాపుగా ఆన్లైన్ లోనే పొందే వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. అనంతరం స్లాట్ బుక్ చేసుకున్న వారికి, లెర్నింగ్ లైసెన్స్ పత్రాలు మంత్రి అందజేశారు. ఈకార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, అర్ టి ఓ కిషన్ రావు, జిల్లా అర్ టి ఎ మెంబర్ వల్లభనేని రామారావు, ఆర్.జె.సి కృష్ణ, కార్పొరేటర్‌లు కర్నాటి కృష్ణ, మక్బూల్, మందడపు లక్ష్మి, పకాలపాటి విజయ, దండా జ్యోతి రెడ్డి, నాయకులు పగడాల నాగరాజు, తాజుద్దీన్, తోట వీరభద్రం, కొల్లు పద్మ ఉన్నారు.

# మోడీ రాకను నిరసిస్తూ సిపిఐ భారీ ర్యాలీ, ధర్నా- కూనంనేనితో సహా పలువురు నేతలు అరెస్ట్




వరంగల్, జులై 7: రాష్ట్ర విభజన హామీలు అమలు చేయని ప్రధాని నరేంద్ర మోడీకి తెలంగాణలో అడుగు పెట్టే అర్హత లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. వరంగల్ కి రేపు ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలో ఆయన పర్యటనను నిరసిస్తూ సిపిఐ హనుమకొండ, వరంగల్ జిల్లా సమితిల ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ కార్యాలయం నుండి ఏకశిలా పార్కు వరకు ప్రదర్శన నిర్వహించిన అనంతరం ఏకశిలా పార్కు ఎదుట వందలాది మంది సిపిఐ కార్యకర్తలతో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న హామీలు అమలు చేయకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేసిందని అన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం తలో ఉక్కు పరిశ్రమ, ములుగులో గిరిజన విశ్వవిద్యాలయంతో పాటు రాష్ట్రంలోని కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని అన్నారు. నేడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇప్పటికే కాజీపేటలో ఉన్న పీరియాడికల్ వ్యాగన్ ఓవర్ హాలింగ్ వర్క్ షాప్ స్థానంలో వ్యాగన్ రిపేర్ సెంటర్ అని, తాజాగా వ్యాగన్ మ్యానిఫాక్చరింగ్ యూనిట్ అని చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు.

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహారాష్ట్ర లాతూర్ లో, గుజరాత్ లో కోచ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేశారని, విభజన చట్టంలో పేర్కొన్న కోచ్ ఫ్యాక్టరీని కాజీపేటలో ఎందుకు నెలకొల్పలేదని ప్రశ్నించారు. కోచ్ ఫ్యాక్టరీని మరుగున పరిచేందుకే కేవలం 521 కోట్లతో పీరియాడికల్ ఓవర్ హాలింగ్ (పిఓహెచ్)ను ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని, కేవలం ఎన్నికల లబ్ధి కోసమే కాజీపేటలో వ్యాగన్ యూనిట్ పేరుతో మభ్య పెడుతున్నారని విమర్శించారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ వస్తే ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేవని, గిరిజన యూనివర్సిటీ ద్వారా గిరిజన విద్యార్థులకు మేలు జరిగేదని అన్నారు.

వరంగల్ లోని మామునూర్ ఏయిర్ ఫోర్టును అభివృద్ధి పరచలేదని, గడిచిన తొమ్మిదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమనూ వరంగల్ లో ఏర్పాటు చేయలేదని అన్నారు. విభజన హామీలపై తాము ఇప్పటికే ప్రజా పోరు యాత్ర నిర్వహించామని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కూడా రోడ్డెక్కాలని, అన్ని పార్టీలు కలిసి కేంద్రాన్ని నిలదీయాలని అన్నారు. తమకు రాజకీయ దురుద్దేశం లేదని, ప్రజల కోసమే ఉద్యమిస్తున్నామని, రాజ్యాంగ పద్ధతులలో శాంతియుత నిరసన తెలుపుతున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా సిపిఐ కార్యకర్తలు గో బ్యాక్ నరేంద్ర మోడీ అంటూ, విభజన హామీలు నెరవేర్చాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు ధర్నా చేస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు సహా సిపిఐ నాయకులను అరెస్టు చేసి సుబేదారి పోలీస్ స్టేషను కు తరలించారు.

ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ, వరంగల్ జిల్లా కార్యదర్శులు కర్రె బిక్షపతి, మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి,మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు మారుపాక అనిల్ కుమార్, మండ సదాలక్ష్మి, ఆదరి శ్రీనివాస్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, గన్నారపు రమేష్, గుండె బద్రి, మునగాల బిక్షపతి,కొట్టెపాక రవి, బాషబోయిన సంతోష్, ల్యాదెళ్ల శరత్, మాలోతు శంకర్, మంచాల రమాదేవి, కండె నర్సయ్య, దేవా, దస్రూ తదితరులు పాల్గొన్నారు.

# కమీషన్ల కోసమే ప్రాజెక్టులు -మంత్రి ప్రశాంత్‌పై మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఫైర్

నిజామాబాద్, జులై 7: నిజామాబాద్ పట్టణంలో నాలుగు సంవత్సరాల క్రితం మంత్రి ప్రశాంత్ రెడ్డి ప్రారంభించిన భూగర్భ మురుగునీరు శుద్ధి ప్రాజెక్ట సంవత్సరాలు గడుస్తున్న ఎందుకు ముందుకు సాగడం లేదని, రూ 246 కోట్ల కమిషన్ల కోసమే తప్ప ప్రాజెక్ట ద్వారా ప్రజలకు ప్రయోజనం మాత్రం అందించలేకపోయారని మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం నిజామాబాద్ నగరం లో నగర కాంగ్రెస్ కమిటీ అధ్య క్షులు కేశ వేణు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దశాబ్ది దగా కార్య క్రమం లో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి పాల్గొని పట్టణ మురుగునీటి శుద్ధి ప్రాజెక్టును, ప్రభుత్వ ఆసుపత్రిని, ప్రభుత్వ వైద్య కళాశా లను సందర్శించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి మాట్లా డుతూ మురుగు నీటిని శుద్ధి చేసే ఉద్దేశంతో ప్రారంభించిన ప్రాజెక్టుకు ఇప్పటివరకు నగరం లోని ఇళ్లకు మురుగునీటి కనెక్షన్ ఇవ్వకపోవడం సిగ్గుచేట ఆయన అన్నారు. డ్రైనేజీ సిస్టం ద్వారా మురుగు నీటిని తీయడంలో ఈ ప్రాజెక్టు పని తీరు సరిగా లేదని నగరంలో మురుగునీరు ద్వారా దోమలు, ఇతరత్రా క్రిమి కీటకాలు చేరి పట్టణ ప్రజలు అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలవుతు న్నారని ఆయన అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి రూ246 కోట్లతో ప్రాజెక్టును నిర్మించామని గొప్పలు చెప్పా రు తప్ప ప్రాజెక్టు పని తీరును పర్యవేక్షించలేకపోయారని ఆయన మండిపడ్డారు. ఇప్ప టికైనా ప్రజాప్రతినిధులు అధికా రులు కళ్ళు తెరిచి నగరంలోని అన్ని ప్రాంతాలకు డ్రైనేజీ సిస్టం మెరుగుపరిచి మొరుగునీటిని సేకరించి మురుగునీటి శుద్ధి ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సామాన్య ప్రజల ఆరో గ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రభుత్వ ఆసుప త్రిలో రోగుల కు అన్ని రకాల మౌలిక వసతు లు కల్పించ డంతో పాటు అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేసి పెరుగుతున్న రోగుల సంఖ్యను దృష్టిలో పెట్టు కొని వారికి సరిపడా వైద్య సిబ్బందిని నియమించాలని తాను ప్రభుత్వాన్ని కోరినట్లు మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్ర మంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి , పిసిసి ఉపాధ్యక్షులు తాహిర్ బిన్ హమ్దాన్ , జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాద వ్ ,జిల్లా ఎన్ఎస్యుఐ అధ్య క్షులు వేణు రాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్ ,రాష్ట్ర ఎన్ఎస్యుఐ ప్రధాన కార్యదర్శి విపుల్ గౌడ్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాజ నరేంద ర్ గౌడ్ ,పిసిసి కార్యదర్శి రాం భూపాల్ ,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దయాకర్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అంతి రెడ్డి రాజారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశ మహేష్, అబూద్ బీన్ హమ్దాన్, సేవాదళ్ సంతోష్, పీసీసీ డెలిగేటి ఈసా ,నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రీతం ,అబ్దుల్ ఎజాజ్, గంగారెడ్డి, అష్రఫ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# కోయంబత్తూరు డీఐజీ విజయ్ కుమార్ ఆత్మహత్య

చెన్నైజూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : కోయంబత్తూరు డీఐజీ విజయ్ కుమార్ (45) నేటి తెల్లవారుజామున క్యాంపు కార్యాలయంలో సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తమిళనాడులోని తేని జిల్లాకు చెందిన విజయకుమార్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఆ తరువాత గ్రూప్ వన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి డీఎస్పీగా కెరీర్ ప్రారంభించారు. మొదటగా నెల్లై జిల్లా వల్లియూర్‌లో ఏఎస్పీగా కెరీర్ ప్రారంభించారు.

దీని తర్వాత కాంచీపురం, కడలూరు, నాగపట్నం, తిరువారూరు జిల్లాల్లో ఎస్పీగా పనిచేశారు. సీబీసీఐడీలో ఎస్పీగా కూడా పనిచేసిన విజయకుమార్ సాతంకుళం జంట హత్య కేసును తొలిసారిగా దర్యాప్తు చేశారు. కోయంబత్తూరు,

తిరుపూర్, ఈరోడ్, నీలగిరి నాలుగు జిల్లాల పర్యవేక్షణ అధికారిగా పని చేశారు. గత జనవరిలో విజయకుమార్ కోయంబత్తూరు డీఐజీగా బాధ్యతలు చేపట్టారు.

గత రెండు రోజులుగా విజయకుమార్ కుటుంబ కారణాలవలన మనస్తాపానికి గురైనట్లు సమాచారం. ఆయన కొంత కాలంగా నిద్ర సరిగా ఉండటం లేదని తోటి అధికారులకు చెప్పినట్టు తెలుస్తోంది. మొత్తానికి డిప్రెషన్‌తోనే ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలుస్తోంది. నిన్న రాత్రి కోయంబత్తూరు డిప్యూటీ కమిషనర్ కుమారుడి పుట్టినరోజు వేడుకలకు సైతం హాజరైన విజయ్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపుతోంది. కాగా.. విజయకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పాంథియా రోడ్డు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆత్మహత్యకు గల కారణాలపై కూడా విచారణ జరుపుతున్నారు తమిళనాడు సీఎం స్టాలిన్.. విజయ్ కుమార్ మృతి విషయం తెలుసుకుని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ట్విటర్ వేదికగా విజయ్ కుమార్ కుటుంబ సభ్యులకు స్టాలిన్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# దేశ జిడిపిలో మత్స్య ఉత్పత్తుల రంగం కీలకం-కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు





అమరావతి, జులై 7:భారతదేశ జిడిపిలో మత్స్య ఉత్పత్తుల రంగం ప్రధానమైనదని కేంద్ర సముద్ర విజ్ఞాన శాస్త్ర మంత్రిత్వ శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా సముద్ర సమాచార వ్యవస్థల భారత జాతీయ కేంద్రం ఆధ్వర్యంలో సముద్ర సమాచారం, సలహా సేవలపై భారీ అవగాహన కార్యక్రమం శుక్రవారం కృష్ణా జిల్లా మచిలీపట్నం రెవెన్యూ కల్యాణ మండపంలో నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ తదితరుల సమక్షంలో కేంద్ర మంత్రి జ్యోతి ప్రజ్వలన గావించి అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. సముద్ర సమాచార వ్యవస్థల భారత జాతీయ కేంద్రం హైదరాబాద్ వారు మత్స్యకారులు చేపల వేట యజమానులకు నిరంతరం సముద్ర సమాచారం అందిస్తున్నారని, సునామీ వంటి ప్రకృతి విపత్తుల విషయంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నారని అన్నారు. సముద్రంలో చేపలు సమృద్ధిగా దొరుకు ప్రాంతాలను గుర్తించి మత్స్యకారులు బోటు యజమానులకు తెలియజేస్తూ, సముద్రంలో ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించి హెచ్చరించడం వంటి బృహత్తర సమాచారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఇంతటి బృహత్తర కార్యకలాపాలను నిర్వహిస్తున్న ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓ షన్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐ ఎన్ సి ఓ పి ఐ) వారు వారి కార్యకలాపాలను సముద్ర సంబంధిత సమాచారాన్ని మత్స్యకారులకు నేరుగా/ ప్రత్యక్షంగా వివరించి అవగాహన కల్పించేందుకు భారత ప్రభుత్వ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా భారతదేశ తూర్పు, పశ్చిమ తీరాలలో నిర్వహించ తలపెట్టిన 5 వర్క్ షాపుల్లో మొదటిగా ఆంధ్రప్రదేశ్ లో మచిలీపట్నంలో నేడు వర్క్ షాప్ ఏర్పాటు చేయడం మనందరికీ ఆనందదాయకమన్నారు.

దేశీయంగా అభివృద్ధి చేసిన సాంకేతికత ద్వారా సముద్ర సమాచారం, సలహా సేవలు అందజేయడం ఆత్మ నిర్భర్ భారత్ (భారతదేశ స్వావలంబన)కు ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. గతంలో సముద్ర తీరంలో గుర్తించిన గ్రామాలలో ఏర్పాటు చేసిన సమాచార కేంద్రాల ద్వారా ఈ సమాచారాన్ని మత్స్యకారులకు, బోటు యజమానులకు అందించేవారన్నారు. కాలానుగుణంగా వచ్చిన సాంకేతిక అభివృద్ధి వలన నేడు మత్స్యకారులు, బోటు యజమానులు, సముద్ర సంబంధిత సంస్థలు, పరిశోధనా సంస్థలు, విద్యా కేంద్రాలు, విద్యార్థులు, సముద్ర పరిశోధకులు, నౌకా పరిశ్రమ, చమురు సహజవాయువు పరిశ్రమ, భారత నావికా దళం మరియు కోస్ట్ గార్డ్ మొదలగువారి ఆండ్రాయిడ్ /స్మార్ట్ ఫోన్ లకు ఇన్కాయిస్ వారు నేరుగా సమాచారాన్ని చేరవేస్తున్నారన్నారు.

చేపలు సమృద్ధిగా దొరుకు ప్రాంతాల సమాచారం ద్వారా సమయం, ఇంధనం, డబ్బు, మానవ శక్తి ఆదా అవుతాయన్నారు. సునామీ వంటి ప్రకృతి విపత్తులకు సంబంధించిన ముందస్తు హెచ్చరికలు తీర ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు ప్రత్యేకించి మత్స్యకారులకు ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ఎంతగానో ఉపయోగమన్నారు. ఈ ప్రాంత మత్స్యకారులు, బోటు యజమానులకు సముద్ర సంబంధిత విషయాలు చేపల సమృద్ధిగా దొరుకు ప్రాంతాలను గురించి మంచి అవగాహన పొందాలని కేంద్ర మంత్రి సూచించారు. భారతదేశానికి అపార సముద్ర తీరం ఉండడం మత్స్య రంగ అభివృద్ధికి దోహదం చేస్తున్నదని అన్నారు భారతదేశ జిడిపిలో మత్స్యరంగానిదే అగ్రస్థానం అన్నారు. సముద్ర తీరం అధికంగా గల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మత్స్య రంగ అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని అన్నారు 2047 నాటికి భారతదేశ అభివృద్ధికి ప్రధాని దిశ నిర్దేశం చేశారని తెలిపారు.

# బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు

ఆదిలాబాద్, జులై 7: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం రాంనగర్, పవర్ గూడ, సంబాజి గూడ, గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం జెడ్పి చైర్ పర్సన్ కోవ లక్ష్మి క్యాంప్ ఆఫీసులో కోవ లక్ష్మి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారని జైనూర్ మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కుమ్ర భగవంతు రావు తెలిపారు. బీఆర్ఎస్ లో చేరిన వారిలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు గుగ్గే కేశవ్, వాగ్మరే శేషారావు, నర్సింగ్, కారాడ్ అశోక్, డైపలే సంతోష్, భూతలే గోవిందరావులు చేరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి భగవంతు రావ్, ఉప సర్పంచ్ సమాధాన్ డోగ్రే, ముండే సతీష్, బీర్ఎస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆహ్వానం
Centre for Literature and Arts
జానుడి – సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్,
మల్లవరపు జాన్ మధుర సాహిత్య భారతి, ఒంగోలు (రి.నెం.9/2001)

మధురకవి మల్లవరపు జాన్ సాహితీ పురస్కార ప్రదానోత్సవం
తేది: 08.07.2023, ఉదయం 10.30 గంటలకు
వేదిక: రవీంద్రభారతి కాన్ఫరెన్సు హాల్, హైదరాబాద్
మధురకవి మల్లవరపు జాన్ సాహితీ పురస్కార గ్రహీతలు
డా. నాగసూరి వేణుగోపాల్, ప్రముఖ సాహిత్యవేత్త, వైజ్ఞానిక, జర్నలిజం రచయత, మీడియా విశ్లేషకులు (2020)
శిఖామణి (ఆచార్య కె.సంజీవరావు), ప్రముఖ కవి, విమర్శకులు, పత్రికా సంపాదకులు (2021)
ముకుంద రామారావు, ప్రముఖ కవి, అనువాదకులు (2022)
అధ్యక్షులు: డా. కోయి కోటేశ్వరరావు, తెలుగు శాఖాధ్యక్షులు, ప్రభుత్వ సిటీ కళాశాల
ముఖ్య అతిథి: శ్రీ జూలూరి గౌరీ శంకర్, అధ్యక్షులు, తెలంగాణా సాహిత్య అకాడమీ
విశిష్ట అతిథులు
శ్రీ మామిడి హరికృష్ణ, డైరెక్టర్, తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ
ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, తెలుగు శాఖాధ్యక్షులు, హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం
డా. పత్తిపాక మోహన్, సంపాదకులు, నేషనల్ బుక్ ట్రస్ట్
డా. యాకూబ్, ప్రముఖ కవి
ఆత్మీయ అతిథులు
డా. బి.జవహర్, గౌరవాధ్యక్షులు, మల్లవరపు జాన్ మధుర సాహిత్య భారతి
శ్రీ జెల్దా విశ్వనాథ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గోదావరి ఖని
శ్రీ సి.ఎస్. రాంబాబు, అసిస్టెంట్ డైరెక్టర్ (రి), AIR
శ్రీ తంగిరాల సోనీ, ప్రముఖ కవి
శ్రీ మల్లవరపు ప్రభాకరరావు, ప్రముఖ కవి
శ్రీ మల్లవరపు సుధాకరరావు, మల్లవరపు జాన్ మధుర సాహిత్య భారతి
సభా సంచాలకులు
డా. నూకతోటి రవికుమార్, డైరెక్టర్, జానుడి – సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్

# లడఖ్‌కు చేరుకున్న భారత నౌకాదళం 'జూలీ లడఖ్'

న్యూఢిల్లీ, జులై 7:మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా జాతీయ నాయకత్వ దృక్పథానికి కొనసాగింపుగాజజ కేంద్రపాలిత ప్రాంతం లడఖ్‌తో అనుసంధానాన్ని బలోపేతం చేసేందుకు భారత నావికాదళం బహు ముఖ ఔట్రీచ్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం లడఖ్ నుండి రక్షణ సేవల్లో మరింతగా భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి, దేశ నిర్మాణాన్ని బలోపేతం చేయడానికి, ఈ ప్రాంతంలో చైతన్యాన్ని ప్రోత్సహించడానికి ఉద్దేశించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా నావల్ స్టాఫ్ చీఫ్ అడ్‌ఎమ్ ఆర్ హరి కుమార్ జూలై 2023, 06 మరియు 07 తేదీలలో లేహ్‌లో వివిధ ఔట్రీచ్ కార్యకలాపాలను నిర్వహించనున్నారు. గత ఏడాది ఔట్ రీచ్ కార్యకలాపాల్లో భాగంగా భారత నావికాదళం అంత కుముందు ఈశాన్య ప్రాంతంలో విస్తృతంగా కార్యక్రమాలను చేపట్టింది. ఇండియన్ నేవీ ఔట్రీచ్‌లో భాగంగా లడఖ్‌లో చేపట్టబోయే ఈవెంట్‌లలో నేవల్ బ్యాండ్ పబ్లిక్ బ్యాండ్ ప్రదర్శన, ఇండియన్ నేవీ మరియు లడఖ్ యుటి టీమ్ మధ్య స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్, బైక్ మరియు కార్ ఎక్స్‌పెడిషన్ ప్రారంభం మరియు వివిధ పాఠశాల సందర్శనలుఉ న్నాయి. లేహ్‌లో తన పర్యటన సందర్భంగా, సీఎన్ఎస్ లెహ్ మరియు లడఖ్‌ల గౌరవనీయమైన లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్.జి.), బ్రిగ్ (డిఆర్) బి.డి. మిశ్రా, (రిటైర్డ్)ని ఆహ్వానిస్తోంది. యుద్ధ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచడం ద్వారా భారత నౌకాదళం తరపున నివాళు లర్పించనున్నారు. 06 జూలై 23న సింధు సంస్కృతి కేంద్రంలో ఇండియన్ నేవల్ బ్యాండ్ ప్రత్యేక నావల్ బ్యాండ్ కచేరీ 'సర్గమ్'లో ప్రెసిడెంట్ ఎన్.డబ్ల్యు. డబ్ల్యు.ఎ. శ్రీమతి కళా హరి కుమార్‌తో కలిసి సీఎన్ఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. '' సర్గం'కు లెఫ్టినెంట్ గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 07 జూలై 23న, నేవీ టీమ్ ఢ లడఖ్ జట్టు మధ్య స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్ స్పిటుక్ ఫుట్‌బాల్ స్టేడియంలో షెడ్యూల్ చేయబడింది. దీనికి సీఎన్ఎస్ చీఫ్ హోస్ట్‌గా ఢ ఎల్.జి. ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మోటార్‌సైకిల్ మరియు కార్ ఎక్స్‌పెడిషన్‌లను వరుసగా ఢిల్లీ మరియు విశాఖపట్నంకు తిరుగు ప్రయాణానికి ఎల్జీ ఫ్లాగ్ ఆఫ్ చేయనున్నారు.

సీఎన్ఎస్ మరియు ప్రెసిడెంట్ ఎన్.డబ్ల్యు. డబ్ల్యు.ఎ. లామ్‌డాన్ సీనియర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు, ఫ్యాకల్టీని సందర్శిస్తారు మరియు వారితో సంభాషిస్తారు. లడఖ్ నివాసానికి చెందిన నౌకాదళ సిబ్బంది మరియు 20 మంది మహిళలతో సహా 107 మంది పాల్గొనే మోటార్‌సైకిల్ మరియు కార్ ఎక్స్‌పెడిషన్‌లు 15 మరియు 22 జూన్ 23 తేదీలలో వరుసగా ఢిల్లీ మరియు విశాఖపట్నం నుండి ప్రారంభమయ్యాయి. లడఖ్ ప్రాంతాలలో 3000 కంటే ఎక్కువ మంది విద్యార్థులతో విస్తృతంగా నిమగ్నమయ్యారు. లేహ్ నుండి తిరుగు ప్రయాణంలో ఒక్కొక్కరు మొత్తం 5000 కి.మీ.ల దూరాన్ని కవర్ చేస్తూనే వివిధ పాఠశాలల్లోని విద్యార్థులతో పాటు అనుభవజ్ఞులు మరియు స్థానిక ప్రజలతో సంభాషిస్తారు. వివిధ నావికా స్టేషన్‌ల నుండి లడఖ్ నివాసానికి చెందిన నావికాదళ సిబ్బంది అందరూ కూడా ఈ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. యువతను దేశ నిర్మాణంలో, అలాగే భారత నౌకాదళంలో చేరి గర్వంగా దేశానికి సేవ చేయడంలో పాల్గొనేలా యువతను ప్రోత్సహించేందుకు వారి సుసంపన్నమైన అనుభవాలను మరియు విజయగాథలను పంచుకుంటున్నారు.

# వాణిజ్య మరియు క్యాప్టివ్ మైన్స్ బొగ్గు ఉత్పత్తిని సమీక్షించిన మంత్రి ప్రహ్లాద్ జోషి

న్యూఢిల్లీ, జులై 7:కేంద్ర బొగ్గు, గనులు మరియు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి ఈరోజు బొగ్గు మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులతో జరిగిన సమావేశంలో వాణిజ్య మరియు క్యాప్టివ్ గనుల బొగ్గు ఉత్పత్తి పనితీరును సమీక్షించారు.

క్యాప్టివ్ మరియు కమర్షియల్ బొగ్గు గనుల నుండి ఉత్పత్తి జరుగుతోందని మంత్రి ట్వీట్‌లో తెలిపారు. గత ఆరేళ్లలో స్థిరంగా పెరుగుతూ 216% వృద్ధిని నమోదు చేసిందన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య మరియు క్యాప్టివ్ గనుల ద్వారా 39% బొగ్గు ఉత్పత్తిని పెంచే మార్గాలపై ఈరోజు సమావేశంలో శ్రీ జోషి చర్చించారు. భూగర్భ బొగ్గు గనుల నుండి ఉత్పత్తిని కూడా మంత్రి సమీక్షించారు. 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించేందుకు భూగర్భ బొగ్గు గని మిషన్ ప్రణాళికపై ఉద్ఘాటించారు.

జూన్ 2020లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మొట్టమొదటిసారిగా వాణిజ్య బొగ్గు గనుల వేలాన్ని సిఎం (ఎస్‌పి) చట్టం 2015/ఎంఎండిఆర్ చట్టం 1957 కింద ప్రారంభించారు. ఇప్పటివరకు ఆరు విడతల వాణిజ్య బొగ్గు గనుల వేలం పూర్తయింది మరియు మొత్తం సంవత్సరానికి 218.9 మిలియన్ టన్నుల (ఎంటిపిఏ) మొత్తం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 86 బొగ్గు గనులు విజయవంతంగా వేలం వేయబడ్డాయి. మొత్తం 98 గనులను అందించే 7వ విడత వాణిజ్య బొగ్గు గనుల వేలం ప్రక్రియ కొనసాగుతోంది.

వాణిజ్య బొగ్గు గనుల వేలం ప్రారంభానికి ముందు బొగ్గు గనుల నిర్వహణకు సగటు వ్యవధి ఐదు సంవత్సరాలు. అయితే వాణిజ్య వేలం తర్వాత బొగ్గు గనుల నిర్వహణ యొక్క సగటు వ్యవధి గణనీయంగా తగ్గింది మరియు ఉత్పత్తి సహకారంతో ఇప్పటికే ఫలితం కనిపించింది.మొదటి వాణిజ్య బొగ్గు గని దాని కేటాయింపు నుండి ఒక సంవత్సరంలో ఉత్పత్తిని ప్రారంభించింది.2021-22 ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య బొగ్గు గనుల నుండి బొగ్గు ఉత్పత్తి 1.15 మిలియన్ టన్నులు (ఎంటి) మరియు 2022-23 ఆర్థికసంవత్సరంలో 7.12 ఎంటి నాలుగు వాణిజ్య బొగ్గు బ్లాకులతో అంటే సుల్యారీ, గారెపాల్మా 4/1, గారెపాల్మా 4/7 మరియు గోటిటోరియమైన్‌లు ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో అదనంగా ఆరు వాణిజ్యపరంగా వేలం వేయబడిన బొగ్గు గనులు 12.2 మిలియన్ టన్నుల (ఎంటి) బొగ్గు ఉత్పత్తిని ఆశించే అవకాశం ఉందని అంచనా వేయబడింది.

# భారత్-అమెరికా నౌకాదళాల పేలుడు పదార్థాల నిర్వీర్య విన్యాసాలు - సాల్వెక్స్




న్యూఢిల్లీ, జులై 7:భారత నౌకాదళం – అమెరికా నౌకాదళం (ఐఎన్ – యూఎస్ఎన్) మధ్య 'సాల్వేజ్ అండ్ ఎక్స్‌ప్లోజివ్ ఆర్డినెన్స్ డిస్పోజల్' (ఈవోడీ) – సాల్వెక్స్ ఏడో విడతను జూన్ 26 నుంచి జులై 06 వరకు కోచిలో నిర్వహించారు. భారత్, అమెరికా నౌకాదళాలు కలిసి 2005 నుంచి ఈ విన్యాసాల్లో పాల్గొంటున్నాయి.

నిపుణులైన డైవింగ్, ఈవోడీ బృందాలతో పాటు ఐఎన్ఎస్ నిరీక్షక్, యూఎస్ఎన్ఎస్ సాల్వర్ నౌకలు కూడా ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి.

రెండు దేశాల డైవింగ్ బృందాలు కలిసి 10 రోజుల పాటు సముద్ర రంగ మందుపాతరల తొలగింపు అనుభవా లను పంచుకున్నారు. భూమిపై, సముద్రంలో ఈవోడీ కార్యకలాపాల్లో కలిసి శిక్షణ పొందారు.

పరస్పర సహకారం, సమన్వయం పెంచుకోవ డానికి, సముద్ర రంగ మందుపాతరల నిర్వీర్యం, ఈవోడీ పనుల్లో ఉత్తమ పద్ధతుల నుంచి పరస్పరం తెలుసుకోవ డానికి ఉమ్మడి శిక్షణ నిర్వహించారు.

మందుపాతరల గుర్తింపు, నిర్వీర్యం, శిథిలాల ప్రదేశాన్ని గుర్తించడం, తొలగించడం వంటి విభిన్న అంశాల్లో డైవింగ్ బృందాల నైపుణ్యాన్ని ఈ ఉమ్మడి విన్యాసాలు మెరుగుపరిచాయి.

# తెలంగాణలో గంట గంటకూ మారిపోతున్న రాజకీయాలు

హైదరాబాద్ జూలై 7 (ఎక్స్‌ప్రెస్ న్యూస్)తెలంగాణలో రాజకీయాలు గంట గంటకూ మారిపోతున్నాయ్.. ఎప్పుడు ఏ నేత సొంత పార్టీకి గుడ్ బై చెప్పి.. వేరే పార్టీలో చేరతారో..? అర్థం కాని పరిస్థితి. బీఆర్ఎస్ పార్టీ నుంకాంగ్రెస్, బీజేపీలోకి.. బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి ఇలా నేతలు జంపింగ్‌లు షురూ చేసేశారు. ఇప్పటికే పలువురు కీలక నేతలు, ముఖ్య నేతలు కండువాలు మార్చేయగా.. మరికొందరు క్యూలో ఉన్నారు. త్వరలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా రాబోతుండటం.. సిట్టింగుల్లో సుమారుగా 30 మందిని దాకా మార్చే యోచనలో గులాబీ బాస్ కేసీఆర్ ఉన్నారని వార్తలు రావడం.. మరోవైపు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను తొలగించి కిషన్ రెడ్డిని నియమించడం.. ఈ రెండు పరిణామాలతో ఒక్కసారిగా రాజకీయాలు హీటెక్కాయి. సరిగ్గా ఈ పరిస్థితుల్లోనే బీజేపీ, బీఆర్ఎస్‌లోని అసంతృప్తులు కొందరు.. టికెట్ దక్కదని తెలుసుకున్న మరికొందరు నేతలు కాంగ్రెస్‌లో చేరడానికి క్యూ కడుతున్నారు. ఇందులో ముగ్గురు బిగ్ షాట్‌లు ఉన్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇదేగానీ జరిగితే కాంగ్రెస్‌కు మంచిరోజులేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇంతకీ ఆ ముగ్గురు ఎవరు.. ఎందుకు కాంగ్రెస్‌నే ఎంచుకుంటున్నారు

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. తమకు ఏ పార్టీలో ఉంటే టికెట్ దక్కుతుంది.. టికెట్ వచ్చినా ఏ మేరకు గెలుపు అవకాశాలున్నాయ్..? క్యాడర్ పరిస్థితి ఎలా ఉంది.. మునుపటిలాగే గెలిపించి అసెంబ్లీకి పంపిస్తుందా.. లేకుంటే తారుమారయ్యే ఛాన్స్ ఉందా.. ఏ పార్టీ తరపున పోటీచేస్తే కలిసొస్తుంది.. అని అన్నీ బేరీజు చేసుకుని సిట్టింగ్‌లు, ముఖ్యనేతలు, కీలక నేతలు అడుగులేస్తున్నారు. ఈ క్రమంలోనే తమకు టికెట్ హామీ ఇవ్వకపోవడం, కన్నతల్లి లాంటి పార్టీని వదులుకుని పార్టీ మారినా సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని తీవ్ర అసంతృప్తికి లోనైన ఇద్దరు బీజేపీ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోవడానికి రెడీ అయిపోయారని విశ్వసనీయ వర్గాల సమాచారం. మరోవైపు బీఆర్ఎస్ చెందిన పలువురు అసంతృప్త నాయకులు ఆ పార్టీని వీడివెళ్లగా.. మరికొంతమంది నేతలు కారు దిగేందుకు సిద్ధమవుతున్నారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సైతం గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రధాన అనుచరుడు, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, మహబూబ్ నగర్ మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి ఈ ఇద్దరూ త్వరలో కాంగ్రెస్‌లో చేరబోతున్న మాజీ మంత్రి, సీనియర్ నేత జూపల్లి కృష్ణారావుతో టచ్‌లోకి వెళ్లారు. నమ్మివచ్చినా ఈటల తనకు న్యాయం చేయలేదని.. ఏనుగు, పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వట్లేదని యెన్నం అసంతృప్తికి లోనయ్యారు. ఈ క్రమంలోనే జూపల్లితో భేటీ కావడం, కాంగ్రెస్‌లోకి ఆ ఇద్దర్నీ ఆహ్వానించడం ఇవన్నీ చకచకా జరిగిపోయాయి. రెండేళ్ల కిందటి నుంచీ ఈ ఇద్దరూ బీజేపీలో కొనసాగుతూ ఈటల వెంటే నడుస్తున్నారు. ఈ ఇద్దరూ పార్టీ వీడితే బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగలడంతో పాటు.. ఈటలకు కూడా వ్యక్తిగతం పెద్ద దెబ్బేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వాస్తవానికి.. కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత ఒక్కసారిగా తెలంగాణ బీజేపీలో సీన్ మారిపోవడం, దీనికి తోడు అధ్యక్షుడి మార్పు ఇవన్నీ.. నిన్న మొన్నటి వరకూ బీఆర్ఎస్‌తో టఫ్ వార్ అనే పరిస్థితి నుంచి.. ఇప్పుడు థర్డ్ ప్లేస్‌కు పడిపోగా.. ఆ స్థానాన్ని కాంగ్రెస్ ఆక్రమించేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇప్పుడు నేతలను కాపాడుకోలేని స్థాయికి బీజేపీ చేరిందన్న మాట. వీరితో పాటు మాజీ మంత్రి, బీజేపీ మహిళా నాయకురాలు డీకే అరుణ ప్రధాన అనుచరుడు పవన్ కుమార్ రెడ్డి కూడా కాంగ్రెస్ కండువా కప్పుకోవడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. జూపల్లి కాంగ్రెస్‌లో చేరే రోజే ఈ ముగ్గురు భారీ బహిరంగ సభావేదికగా ప్రియాంక గాంధీ సమక్షంలో కండువా కప్పుకోవడానికి ముహూర్తం ఫిక్స్ చేసుకున్నారు. అయితే వీళ్లు ఆశించిన స్థానాల్లో టికెట్లు ఇవ్వలేకపోయినా సర్దుబాటు చేస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చినట్లుగా తెలియవచ్చింది.

రానున్న ఎన్నికల్లో మహేశ్వరం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోతే తాను పార్టీని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తేల్చిచెప్పేశారు. కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన సబితాఇంద్రారెడ్డికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని.. టీడీపీలో ఉన్నప్పుడే తనకు పదవులు లభించాయని, బీఆర్ఎస్‌లో ఏ పదవీ దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులను జైల్లో పెట్టించిన సబితకు మంత్రి పదవి ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఈసారి మహేశ్వరం నియోజకవర్గం నుంచి తనకే బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తనకు పార్టీ కార్యక్రమాల సమాచారం ఇవ్వడంలేదని, ఎన్నికల్లో ఓడిపోతే దూరం పెడతారా..? అంటూ ప్రశ్నించారు. ఈసారి సిటింగులకే పార్టీ టికెట్లు ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో తీగల కృష్ణారెడ్డి కాంగ్రెస్‌లో చేరడానికి ముహూర్తం ఫిక్స్ చేసుకున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో టీడీపీలో పనిచేసిన కాలంలో రేవంత్‌రెడ్డి తో ఉన్న పరిచయం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుంటే తీగల కృష్ణారెడ్డి కాంగ్రెస్‌లోనే చేరతారన్న ప్రచారం స్థానికంగా జోరందుకుంది. ఇప్పటికే తన అనుచరులు, కార్యకర్తలతో సమావేశం కావడం భవిష్యత్ కార్యాచరణపై ఓ నిర్ణయానికొచ్చాకే రేవంత్‌తో టచ్‌లోకి వెళ్లారని తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి గెలిచి సబిత బీఆర్ఎస్‌లోకి వెళ్లడంతో ప్రస్తుతం కాంగ్రెస్‌కు క్యాడర్ ఉంది కానీ సరైన నేత ఎవరూ లేరన్నది జగమెరిగిన సత్యమే. ఇప్పుడు తీగల పార్టీలోకి వస్తే ఆయన క్యాడర్‌కు కాంగ్రెస్ క్యాడర్ తోడైతే ఇక మహేశ్వరంలో జెండా ఎగురుతుందని అధిష్ఠానం ధీమాగా ఉందట. అన్నీ అనుకున్నట్లు జరిగితే ప్రియాంక గాంధీ సమక్షంలోనే తీగల కూడా కాంగ్రెస్ కండువా కప్పుకోబోతున్నారని తెలియవచ్చింది.

బీఆర్ఎస్‌లోకి సిట్టింగ్‌లకే సీట్లనే టాక్, కమలంలో కల్లోల్లం.. కాంగ్రెస్‌కు బాగానే కలిసొస్తోందని చెప్పుకోవచ్చు. ఎన్నికల ముందే సీన్ ఇలా ఉంటే.. జులై చివరికి పరిస్థితులు మరోలా ఉంటాయని.. భారీగా కాంగ్రెస్‌లోకి చేరికలు ఉంటాయని ఆ పార్టీ ముఖ్యనేతలు చెప్పుకుంటున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ తొలి జాబితా రిలీజ్ అయ్యాక కాంగ్రెస్‌కు ఇక అన్నీ మంచిరోజులేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ముందుముందు ఇంకా ఏమేం జరుగుతుందో.. వేచి చూడాల్సిందే మరి.

# పుష్పలంకరణ వేడుకకు హాజరైన పరికపల్లి శ్రీనివాస్



ఖమ్మం, జులై 7: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మంరూరల్ మండలం మారెమ్మగుడి నందుగల ఓఫంక్షన్ హాల్ లో దావమాల సైదుబాబు-స్వరూప దంపతుల కుమార్తెలు సాత్విక-వైష్ణవి ల పుష్పాలంకరణ వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించిన పెద్దమునగాల గ్రామసర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్, రంజిత్, తెల్లూరి పిచ్చెయ్య, బాలు, రాయల రాజేష్, నరేంద్ర నాయుడు, పావగంటి చిన్నబాబు, కావూరి శ్రీను, కటుకూరి నరసింహారావు, నరేష్ తదితరులు ఉన్నారు.

# ప్రధానమైన 5 హామీల అమలుకు రూ.52,000 కోట్లు కేటాయింపు

## -కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట

బెంగళూరు జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రధానమైన 5 హామీల అమలుకు కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. ఇందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు జరిపింది. 5 హామీల అమలుకు రూ.52,000 కోట్లు కేటాయించినట్టు ఆర్థిక మంత్రిగా అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. ఇందువల్ల 1.3 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందుతాయని చెప్పారు. రూ.3.27 లక్షల కోట్లతో 2023-2024 బడ్జెట్‌ను సిద్ధరామయ్య శుక్రవారంనాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఐదు హామీల అమలుకు కేటాయించిన బడ్జెట్ ద్వారా ప్రతి కుటుంబానికి అదనంగా రూ.4,000 నుంచి రూ.5,000 వరకూ సాయం అందుతుందని చెప్పారు.సర్కార్ అమలు చేస్తున్న 5 హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, పేదలకు ఉచితంగా 10 కిలోల బియ్యం, , ఇంటి పెద్దగా ఉన్న మహిళకు రూ.2,000 సాయం, యువకులకు రూ.3,000 వరకూ నిరుద్యోగ భృతి వంటివి ఉన్నాయి. కాగా, 2023-24 బడ్జెట్ సమర్పణతో ఆర్థిక మంత్రిగా 14 సార్లు బడ్జెట్ ప్రతిపాదించిన రికార్డును సిద్ధరామయ్య సాధించారు. గతంలో 13 సార్లు బడ్జెట్‌ను ప్రతిపాదించిన రికార్డు మాజీ సీఎం రామకృష్ణ హెగ్డే పేరున ఉంది. 224 అసెంబ్లీ స్థానాలకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 135 సీట్లు గెలుచుకుని ఘన విజయం సాధించగా, బీజేపీ 66 సీట్లు, జేడీ(ఎస్) 19 సీట్లకు పరిమితమయ్యాయి.

# కూనంనేని అక్రమ అరెస్టును నిరసిస్తూ సిపిఐ ప్రదర్శన

## - మోడీ దిష్టిబొమ్మ దగ్ధం
## - తెలంగాణలో మోడీకి పర్యటించే హక్కులేదు



ఖమ్మం, జులై 7: (నేటినిజం ప్రతినిధి): సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అక్రమ అరెస్టును ఖండిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. స్థానిక సిపిఐ కార్యాలయం నుండి బైపాస్ రోడ్డు వరకు ప్రదర్శనగా వెళ్లి మోడీ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. కూనంనేని సాంబశివరావును వరంగల్ పోలీసులు అరెస్టు చేసిన విషయం విధితమే. దిష్టిబొమ్మ దగ్ధం అనంతరం ఆందోళనకారులను ఉద్దేశించి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ...ప్రధాని మోడీకి తెలంగాణ రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన ఏ ఒక్క హామీని మోడీ సర్కార్ నిలబెట్టుకోలేదన్నారు. హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న సిపిఐ నాయకులు కూనంనేని సాంబశివరావు సహా పలువురిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మీరిచ్చిన హామీలనే అమలు చేయమని అడగడం నేరమా అని హేమంతరావు ప్రశ్నించారు. సాంబశివరావు సహా అరెస్టు చేసిన వారందరినీ తక్షణం టీషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా బయ్యారం ఉక్కు కర్మాగారం, వరంగల్ కోచ్ ఫ్యాక్టర్ గిరిజన యూనివర్సిటీ సహా పలు హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. మోడీ తెలంగాణ పట్ల వివక్షత చూపుతున్నారని హేమంతరావు ఆరోపించారు. మతోన్మాద చర్యలు కాకుండా ఈ రాష్ట్రానికి ఏమిచ్చారో ప్రధాని మోడీ వరంగల్ సభలో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మోడీగోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. సాంబశి వరావును విడుదల చేయాలంటూ ఆందోళన కారులు నినదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, కొండపర్తి గోవిందరావు, ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు. పోటు కళావతి, మహ్మద్ నలాం, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు యానాలి సాంబశివరెడ్డి, ఇటికాల రామకృష్ణ, తాటి నిర్మల, నిమ్మతోట రామకృష్ణ, ఏటు, మద్దోజు శ్రావణ్, సైదా, యమాల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.




# మహిళ కడుపులో 8 కిలోల కణితి.. శస్త్రచికిత్స విజయవంతం

హైదరాబాద్, జులై 7: నారాయణపేట జిల్లా ఆస్పత్రిలో ఓ మహిళా కడుపులో నుంచి ఏకంగా 8 కిలోల బరువున్న కణితిని శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా తొలగించారు. నారాయణపేట మండల పరిధిలోని పేరపళ్ల గ్రామానికి చెందిన 45 ఏండ్ల లక్ష్మి అనే మహిళ కడుపు నొప్పితో బాధ పడుతూ ఆస్పత్రికి వచ్చింది. ఆమెకు డాక్టర్లు స్కానింగ్స్ తీయగా.. కడుపులో భారీ కణితి ఉన్నట్లు గుర్తించారు. దీంతో బాధిత మహిళకు సర్జరీ నిర్వహించి కణితిని తొలగించారు. కణితి బరువు 8 కిలోలు ఉంటుందని వైద్యులు తెలిపారు. తన ప్రాణాలను కాపాడిన వైద్యులకు బాధిత మహిళ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. ఈ ఆపరేషన్‌లో వైద్యులు రంజిత్, సవజన్య, దీపిక, నర్సులు విజయలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

# కడియంపై రాజయ్య ఫైర్.. ఎన్‌కౌంటర్ల సృష్టికర్త అంటూ కౌంటర్

వరంగల్, జులై 7: స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ ఎస్‌లో మాటల యుద్ధం కొనసాగుతోంది. కడియం వర్సెస్ రాజయ్య వర్గాల మధ్య పోటాపోటీ నెలకొంది.

ఇవ్వాల ఓ సభలో సీనియర్ నేత, మాజీ మంత్రి కడియం శ్రీహరిపై ఎమ్మెల్యే రాజయ్య ఫైర్ అయ్యారు. ఆయన దేవాదుల సృష్టికర్త కాదని, ఎన్‌కౌంటర్ల సృష్టికర్త అంటూ కామెంట్స్ చేశారు.

శుక్రవారం జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ మండలం తాటికొండలో నిర్వహించిన ఆది జాంబవుని విగ్రహ భూమిపూజ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా సకల జనుల సమ్మెలో కాంగ్రెస్ నుండి రాజయ్య రాజీనామా చేస్తే కడియం శ్రీహరి పోటీ చేయనన్నారాని గుర్తు చేశారు.రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్ళగా మొట్టమొదట టీడీపీ నుండి నామినేషన్ వేశాడు.. కులము అనేది ఆత్మగౌరవంతో సమానం..కుల ప్రస్తావన జరగాలి.. పార్టీ నుండి బహిష్కరించిన వారే కడియం వెంటా ఉన్నారు.

నియోజకవర్గ ప్రజలు నా వెంట ఉన్నారని స్పష్టం చేశారు.. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడు తున్న కడియం శ్రీహరిని వెంటనే సస్పెండ్ చేయాలని మండి పడ్డారు. ఆడియోలు, వీడియోలు అంటూ నాపై వస్తున్న ఆరోపణలను కోర్టు ద్వారా ఎదుర్కొంటా అని రాజయ్య పేర్కొన్నారు. నియోజకవర్గంలో 85 వేల ఎస్సీల ఓట్లు ఉంటే 68వేలు ఓట్లు నికార్సైన మాదిగలవే అని ఈ సందర్భంగా చెప్పారు.

# వైయస్ఆర్ జయంతి వేడుకలను జయప్రదం చేయండి

ఖమ్మం, జులై 7: (నేటినిజం ప్రతినిధి): మహానేత కాంగ్రెస్ పార్టీ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఈనెల 8న శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వేడుకలను నిర్వహించనున్నట్లు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంఛార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటా న్నారు. ఖమ్మం నగరంలోని ధంసలాపురం, రాపర్తినగర్ ప్రాంతాల్లోని వైయస్ఆర్ విగ్రహాలకు, బూర్గంపాడు మండలం సారపాకలోని వైయస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారని తెలిపారు. అదేవిధంగా వైరాలో జయంతి వేడుకల సందర్భంగా బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కావున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

# 5వవార్డులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

## -పాల్గొన్న కౌన్సిలర్ సునీత ప్రసాద్



ఖమ్మం, జులై 7: (నేటినిజం ప్రతినిధి): వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డ్ లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని అ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ మున్సిపల్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో పలు ప్రాంతాల్లో తిరిగిన కౌన్సిలర్ సునీత ప్రసాద్ ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎలాంటి వస్తువులలో డబ్బాలలో గుంటలలో పాత టైర్ లలో నీరు నిలవ లేకుండా చూసుకోవాలని అన్నారు.

మన ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటే వాటి ద్వారా వ్యాధులు ప్రబులుతాయని దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగస్వాములై ఇంటి పరిసరాలతో పాటు వార్డును కూడా పరిశుభ్రంగా మనందరం ఉంచుకుందామని సునీత ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలోవార్డు అధికారి లాల్ మియా, ఆర్పి నాగమణి, అంగన్వాడీ టిచర్ శ్రీదేవి, రేణుక, ప్రభాకర్ పలువురు మునిసిపాలిటీ సిబ్బంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# ఘనంగా ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భవ దినోత్సవాలు




ఘనంగా ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భవ దినోత్సవాలువేములవాడ రూరల్ మండలం పోశెట్టిపల్లి గ్రామంలోమాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 29వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను కుల బంధువుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశిసన్తూ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గుండా థామస్ మాదిగ మాట్లాడుతూ గత 29 సంవత్సరంలో ఏబిసిడి వర్గీకరణ 5 సంవత్సరాలు అమలు అయిందని, స్వాతంత్రం వచ్చి 52 సంవత్సరాలకు మాదిగలకు 18 వేల ఉద్యోగాలు వచ్చాయన్నారు.వర్గీకరణ ఐదు సంవత్సరాల్లో అమలైనప్పుడు మాదిగలకు 22 వేల ఉద్యోగాలు వచ్చాయని, అంటే పది అంతలు అభివృద్ధి చెందాము

అంతేకాకుండా బడుగు బలహీన వర్గాల కోసం ఉద్యమాలు చేసి వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పింఛని పెరగడానికి కారకులయ్యామన్నారు. తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలక పాత్ర పోషించామనిజ స్త్రీలపై అత్యాచారం జరుగుతుంటే ప్రభుత్వం పట్టించుకోకపోతే ప్రత్యేక పోస్టాక్ కోర్టు జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయాలని ఉద్యమం చేసి సాధించి పెట్టామన్నారు. అట్రాసిటీ కేసులపై నిర్వీర్యం కేంద్ర ప్రభుత్వం చేస్తే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేసి అన్ని రాష్ట్రాల ఉన్న దళిత సంఘాల లీడర్లు పిలిచి లక్షలాది మందితో భారీ బహిరంగ సభ పెట్టి అట్రాసిటీ కేసులు కాపాడుకున్నామని గుర్తుచేశారు. అంతేకాకుండా సామాజిక కోణంలో ఏ కులానికి గాని ఏ వర్గానికి గాని అన్యాయం జరిగితే వాళ్ల పక్షాన అనేకమైన ఉద్యమాలు చేసి వారి హక్కులు సాధించి పెట్టామని,

చెప్పుకుంటూ పోతే ఇంకో ఎన్నో చేశాము ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం ఏబిసిడి వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు మ్యకల జీవన్, లచ్చయ్య, శంకర్, యాకోబు సంతోష్, జీవన్, ప్రభు, కుమార్, మల్లవ్వ, సుమలత, రిబ్కా తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో పోచమ్మకు బోనాలు



రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణం లోని నంది కమాన్ బ్రాంచ్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం పొచ్చమ్మకు ఘనంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులుసంస్కృతి, సంప్రదాయామైనవస్త్రాలంకణతో, పోతురాజు వేషధారణలతో అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాలు అమ్మవారికి సమర్పించారు. ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవి, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని, విద్యార్థులు. తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నిరుపేద దళిత కుటుంబానికి బీఆరెస్ నేత డాక్టర్ గోలి మోహన్ ఆర్థికసాయం



రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటనిజం ప్రతినిధి): వేములవాడ నియోజకవర్గం నాగారం గ్రామానికి చెందిన మ్యాకల నరేందర్ ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఇట్టి విషయాన్ని గ్రామస్తులు డాక్టర్ గోలి మోహన్ దృష్టికి తీసుకుపోగా, గోలి మోహన్ వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, గ్రామస్తులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన నరేందర్ రోడ్డు ప్రమాదంలో చనిపోయిన విషయం డాక్టర్ గోలి మోహన్ కి తెలపగా, వెంటనే స్పందించి, నాగారం గ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ గోలి మోహన్ కి గ్రామస్తుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.డాక్టర్ గోలి మోహన్ మాట్లాడుతూ మరణించిన నరేందర్ కుటుంబానికి నాగారం గ్రామస్తులు అండగా నిలిచి, కుటుంబ సభ్యులకు మనో ధైర్యం ఇవ్వాలని అన్నారు. మృతుడు నరేందర్ కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, చిన్న కుమార్తె లాస్య డిగ్రీ చదువతున్న విషయం తెలుసుకుని, తను చదువులో రాణిం చాలని, చదువుకు కావలసిన ఆర్థిక సహాయం అందిస్తానని, భవిశ్యత్తులో ఉద్యోగ భద్రతకు భరోసా ఇచ్చారు. కుటుంబానికి తోడ్పాటు గా నరేందర్ భార్య వినోదకు చెక్కును అందించారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని, గ్రామంలోని యువత చదువులో ముందుండి ఉద్యోగాలు సాధించి, ఆర్థికంగా అభివృద్ధి చెందాలనిసూచించారు. అందుకు తగిన సహకారం అందిస్తానని అన్నారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల మద్దతుతో ఎమ్మెల్యేగా గెలిచిజ్ మరింత సేవలందిస్తానని గ్రామస్తులకు తెలియజేశారు.

# పోచమ్మ తల్లికి పూజలు నిర్వహించిన బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటనిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపుకులస్థుల ఆధ్వర్యంలో జరుగుతున్న "పోచమ్మ బోనాల పండుగ సందర్భంగా మత్తడి పోచమ్మ దేవాలయంలో అమ్మవారిని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని బోనాలు సమర్పించుకొని, పిల్ల పాపలు పాడి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏనుగు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆ పోచమ్మ తల్లిని వేడుకున్నట్టు తెలిపారు. అనంతరం మనోహర్ రెడ్డిని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య ఘనంగా శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నరాల శేఖర్, మారం కుమార్ , కొండ కనకయ్య, కొండ నరసయ్య, నీలం శేఖర్, రాజేందర్, నామాల పోచెట్టి, కూరగాయల శేఖర్,మారం మహేష్, పొన్నం శ్రీధర్, వెంకటేశ్వర్లు తదతరులుపాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కలిగివుండాలి:డా. బి.మాలతి

ఖమ్మం, జులై 7: (నేటినిజం ప్రతినిధి): సీజనల్ వ్యాధులు పట్ల అవగాహన కల్గి వుండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరకుండా కాపాడుకోవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డా.బి.మాలతి అన్నారు. వర్షాకాలం కావున దోమలు అభివృద్ధి చెంది, దోమలతో డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఖమ్మం జిల్లాలో 2023 సంవత్సరంలో ఇప్పటివరకు 18 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదు అయినట్లు, పాజిటివ్ వచ్చిన వారికి చికిత్స అందించి, ఆయా కేసుల ఇంటి లోపల, బయట, పరిసరాల్లో పైరిత్రం పిచికారీ చేయించి, వ్యాధి ప్రబలకుండా అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. గత సంవత్సరం (2022)లో జిల్లాలో711పాజిటివ్ కేసులు రాగా, ముందస్తు నియంత్రణ చర్యలు వల్ల డెంగ్యూ పాజిటివ్ కేసులు చాలా వరకు తగ్గినట్లు ఆమె అన్నారు. ఈడీస్ ఈజిప్టే అనే దోమకాటు వల్ల డెంగ్యూ వ్యాధి వస్తుందని ఆమె తెలిపారు. నవజాత శిశువులు, గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువ కలిగియున్నవారికి ఈ వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆమె అన్నారు. దోమల నియంత్రణతో వ్యాధి కట్టడి చేయవచ్చన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాలు డ్రైడే లుగా పాటించాలని, ఆ రోజుల్లో ఇల్లు, ఇంటి పరిసరాలలో నిల్వ ఉన్న నీటిని తొలగించడం, ఇంటిలో ఉన్న నీటి తొట్టెలు, సిమెంట్ కుండీలు, డ్రమ్ములలో ఉన్న నీటిని మొత్తం పారబోసి, శుభ్రంగా కడిగి, ఆరబెట్టినా తరవాత నీరు నింపుకోవాలన్నారు. దీనివల్ల ఈడిస్ దోమ జీవిత చక్రానికి అంతరాయం ఏర్పడి, లార్వాలు అంతరిస్తాయన్నారు. దోమల నియంత్రణలో ప్రజలు పాలుపంచుకోవాలని జిల్లా వైద్యాధికారిణి అన్నారు. పనికిరాని గుంతలను, లోతట్టు ప్రదేశాలను, వాడని బావులను పూడ్చి, నీరు నిల్వ కాకుండా చూడాలన్నారు. కొబ్బరిబోండాలు, ప్లాస్టిక్ కప్పులు, పగిలిపోయిన మట్టి కుండలు, పాడైన టైర్లు లేకుండా చూడాలని ఆమె తెలిపారు. చెత్త, చెదారం మురుగు కాల్వల్లో చేరకుండా చూడాలన్నారు. మురుగుకాల్వల్లో పూడిక తీసి, నీరు పారేలా చేయాలన్నారు. కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించాలని, పరిసరాల పారిశుధ్యం పాటించాలని ఆమె తెలిపారు.

# వేములవాడ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## -ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు
## -మత్తడి పోచమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో మున్నూరు కాపు కులబాందవుల ఆహ్వానం మేరకు శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు శుక్రవారం మత్తడి పోచమ్మ బోనాల పండుగకు హాజరై, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోనాల పండుగ రాష్ట్రంలోనే మంచి ఆనవాయితీ అన్నారు. రాష్ట్రంలోనే వైభవోపేతంగా బోనాల పండుగ జరిగేది ఒక్క వేములవాడలో మాత్రమే అన్నారు. నిత్య బోనాలు జరిగేది ఒక్క వేములవాడలో మాత్రమే అన్నారు. రాజన్న గుడిని అభివృద్ధి చేయలనుకున్నపుడు మొదటిది ఆలయ విస్తరణ, గుడి చెరువును నిండు కుండలా చేసుకున్న తరువాత బద్దీ పోచమ్మ దేవాలయ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. 20కోట్లతో బద్దీ పోచమ్మ దేవాలయానికి ఏకరం స్థల సేకరణ చేసామని, వచ్చే వారంలో 10కోట్లతో బోనాల మండపం నిర్మాణానికి మంత్రి వర్యులు కేటీఆర్ భూమిపూజ చేయనున్నారని అన్నారు. వేములవాడ ఒకప్పుడు రాజధానిగా ఉండే దేవాలయాన్ని చాళుక్యులు కట్టించారని, ఇదంతా దేవాలయంలో శిలాశాసనంపై చెక్కి ఉంచారని గుర్తు చేశారు. వేములవాడ ఒకప్పుడు రాజధానిగా ఉండే దేవాలయాన్ని చాళుక్యులు కట్టించారని, ఇది వాస్తవమని, ఇదంతా మన దేవాలయంలో శిలాశాసనంపై ఉందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వా దేవాలయాలు సాంస్కృతిలో విశిష్ట స్థానాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ కల్పిస్తున్నారని అన్నారు. ఒక చినుకు వర్షం పడక ముందే వేములవాడ గుడి చెరువు నిండికుండలాగా ఉన్నదని, ఎలా సాధ్యమైంది అంటే కాళేశ్వరం పంపులు ప్రారంభమై రివర్స్ పంపింగ్ ద్వారా రాష్ట్ర రావు పేట నుండి వరద కాలువను నింపుకొని, తలాపన ఉన్న రాజేశ్వరి జలాశయంకు 23 టీఎంసీల నీళ్లను తెచ్చుకున్నామని అన్నారు. చక్కని వాతావరణంలో బోనాల పండుగను చేసుకుంటున్నామని అన్నారు. పట్టణంలో మున్నూరు కాపుల పాత్ర అభినందనీయమని, వచ్చే కాలంలో నిరుపేదలైన వారికి పట్టణంలో 1200 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వబోతున్నామని, అలాగే పలు అభివృద్ధి పనులు చేయబోతున్నామని అన్నారు. హంగులు, ఆర్భాటాలు చేయడం నాకు ఇష్టం ఉండదని అన్ని వర్గాల మనిషి చెన్నమనేని రాజేశ్వర్ రావు పెంపకంలో పెరిగిన తాను నిజాయితీ, నిరాడంబరంతో పని చేస్తామని అన్నారు. వేములవాడ కన్నతల్లి లాంటిది అని, వేములవాడకు ప్రతీ అభివృద్ధి పని నాకు కన్నతల్లికి సేవ చేయడమే అని నేను భావిస్తానని అన్నారు. అభివృద్ధిలో ఎవరికి నష్టం కలగకూడదనే ముఖ్య ఉద్దేశ్యంతో ప్రజలను అభివృద్ధిలో భాగస్వాములను చేసుకొని ముందుకెళ్తున్నామని అన్నారు. మరోసారి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్. కొండ దేవయ్య, కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాసరావు, మారం కుమార్, ఇప్పప్పుల అజయ్, నరాల శేఖర్, బింగి మహేష్, కొండపావని నరసయ్య, కొండ శ్రీలత కనకయ్య, బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు పుల్కం రాజు, గోస్కుల రవి, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ ప్రజలు ఐక్యతగా ఉంటేనే గ్రామ అభివృద్ధి సాధ్యం

## – ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ చెన్నమనేని వికాస్ రావు
## -3 వ వార్డులో వాటర్ ప్లాంట్ ప్రారంభం



రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోనిఅయ్యోరుపల్లి గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత శుద్ధ జల కేంద్రాన్ని ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనీరు చాలా అవసరం ఎందుకంటే జలమే జీవం కాబట్టి వానకాలంలో స్వచ్ఛమైన నీటిని తీసుకోక పోతే టైఫాయిడ్, కామెర్లు పచ్చ కామెర్లు లాంటి జ్వరాలకు గురవుతారని, స్వచ్ఛమైన తాగునీటి సమస్య నేటితో తీరుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని, రాజకీయాలకు అతీతంగా సమిష్టి కృషితో అయ్యోరుపల్లి కి ఉచిత శుద్ధ జల కేంద్రాన్ని తెచ్చుకోవడం గొప్ప విజయం అనిఅన్నారు.వేములవాడ,ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జగిత్యాల ,రాజన్న సిరిసిల్ల పరిధిలో కావచ్చు తమ కుటుంబానికి ఎంతో అనుబంధంగా ఉన్నాయని మాజీ మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అన్నారు.

గ్రామ పంచాయతీలు స్థానిక ప్రభుత్వాలు, మున్సిపాలిటీలో నిధులు లేకుండా సర్పంచ్ లు, కౌన్సిలర్లు ఎంత గానో కష్టపడుతున్నా సమయానికి నిధులు రాకపోతే చేసిన పనులకు అప్పులు తీర్చలేక పోతున్నారని, ప్రభుత్వ తీరుతో ప్రజాప్రతినిధులుసతమతమవుతున్నారని, తక్షణమే ప్రభుత్వం వీటి గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని, అధికారం కేవలం రాజకీయ నాయకుల దగ్గర ఉంటే స్థానికంగా అభివృద్ధి జరగదని అధికారం గ్రామస్థాయిలో కేంద్రీకరణ జరగాలని అన్నారు అపుడే ప్రజా స్వామ్య అభివృద్ధి జరు?తుందని అన్నారుఈ కార్యక్రమం లో3 వార్డ్ కౌన్సిలర్ నిమ్మచెట్టి విజయ్,17 వ వార్డ్ కౌన్సిలర్ వంగల దివ్య శ్రీనివాస్ మాజీ సర్పంచులు అంజయ్యవడిజే మల్లయ్య, రాజ మల్లయ్య కుల సంఘాల పెద్దలు హనుమయ్య, వడిజే తిరుపతి, మంగళ తిరుపతి, ఉల్లేందుల రాజు,మల్లేశం , వెంకటేశం,అనీల్,అశోక్,తిరుపతి,నాగరాజ్ మహిళా సంఘం సభ్యులు , గ్రామ పెద్దలు, గ్రామ యువకులు మరియు ప్రతిమ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# టీడీపీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జిగా పులి రాంబాబు నియామకం



రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటి నిజం ప్రతినిధి): తెలుగుదేశం పార్టీ వేములవాడ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గా కొనసాగుతున్న పులి రాంబాబు నియోజకవర్గ ఇంచార్జిగాని యామకమయ్యారు. శుక్రవారం హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నియామక పత్రాన్ని రాంబాబుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ అబ్జర్వర్ వంచ శ్రీనివాస్ రెడ్డి,పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కల్యాడపు ఆగయ్య, కరీంనగర్, చొప్పదండి, సిరిసిల్ల,హుస్నాబాద్ నియోజకవర్గాల ఇంచార్జిలు గంగా ధర కనకయ్య, జంగం అంజయ్య, ఆవునూరు దయాకర్ రావు,బత్తిని శ్రీనివాస్,ఎడ్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎల్. రమణ పరామర్శించిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటినిజం ప్రతినిధి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ తండ్రి ఎలగందుల రామ్ ఇటీవల మృతి చెందారు. శుక్రవారం జగిత్యాలలో వారి కుటుంబ సభ్యులను వేములవాడ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు. వారి ఆత్మకు ఆ భగవంతుడు శాంతిని చేకూర్చాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట మేడిపెల్లి బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు అంకం సాగర్, చంద్ర మోహన్ రెడ్డి, కూరగాయల శేఖర్, పొన్నం శ్రీధర్ గౌడ్ తదితరులు ఉన్నారు .




Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.